

నోరు లేని మేకల్నే బలి ఇస్తారు.
సింహాల్ని బలివ్వరు, గుర్తించుకోండి.
- డా. బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్ అక్షరమే ఆయుధం ✍

www.Janaswaram.com

జనస్వరం న్యూస్ తెలుగు వారపత్రిక ద్వారా తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్నీ కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి.
మా మెయిల్ ఐడి : janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 9642067900

సంపుటి : 4 | సంచిక : 322 | ఎడిటర్ : నరేష్ సాకే | వార సంచిక : 05 - 06 - 2025 | పేజీలు : 7


## ఆగస్ట్ 15 కల్లా 15 లక్షల 'బంగారు కుటుంబాలు' దత్తత

**- మరింత వేగవంతంగా 'మార్గదర్శి' నమోదు ప్రక్రియ**
**- అధికారులకు లక్ష్యం నిర్దేశించిన ముఖ్యమంత్రి చంద్రబాబు**
**- రాజధాని భూసేకరణ పీ4కు కేస్ స్టడీగా పేర్కొన్న సీఎం**
**- ఇప్పటివరకు 70 వేల కుటుంబాలకు పీ4 సాయం**

**అమరావతి, జూన్ 4 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** జీరో పావర్టీ పీ4 లక్ష్యంలో భాగంగా ఈ ఏడాది ఆగస్ట్ 15 నాటికి రాష్ట్రంలో 15 లక్షల కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకునేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఇందుకు అవసరమైన మార్గదర్శి రిజిస్ట్రేషన్, దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. నాడు ఆర్థిక సంస్కరణల తర్వాత చేపట్టిన పీపీపీ విధానానికి కొనసాగింపుగానే నేడు పీ4 విధానం తీసుకువచ్చామన్నారు. బుధవారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో జీరో పావర్టీ పీ4పై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి.. స్మార్ట్ ఏపీ ఫౌండేషన్‌ను స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్‌గా మార్చాలని నిర్దేశించారు. అమరావతి పీ4కి కేస్ స్టడీగా నిలుస్తుందని, రాజధాని నిర్మాణంలో 29 వేల మంది రైతులను భాగస్వాములు చేయడం ద్వారా వారికి సంపద సృష్టి జరిగేలా చేశామని చెప్పారు. ఇదే స్ఫూర్తితో ప్రతి బంగారు కుటుంబాన్ని మార్గదర్శి దత్తత తీసుకుని వారి ఉన్నతికి కృషి చేసేలా చూడాలన్నారు. ప్రతి 10 రోజులకు ఒకసారి పీ4 పురోగతిని సమీక్షిస్తానని ముఖ్యమంత్రి అన్నారు. మరోవైపు అధికారులు రూపొందించిన పీ4 లోగో డిజైన్లను ముఖ్యమంత్రి పరిశీలించారు.



పీ4 కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపించేందుకు మిలాప్, ప్రాజెక్ట్ డీప్, రంగ్ దే, భార్గో వంటి సంస్థలు భాగస్వాములుగా సహకారం అందించేందుకు ముందుకువచ్చినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. రాష్ట్రంలో 19,15,771 బంగారు కుటుంబాలుగా నమోదు కాగా... వీరిలో ఇప్పటివరకు 70,272 కుటంబాలను మార్గదర్శులు దత్తత తీసుకున్నారని వివరించారు. వీరిలో అత్యధికంగా 26,340 బీసీ కుటుంబాలు, 14,024 ఎస్సీ కుటుంబాలు, 13,115 ఎస్టీ కుటుంబాలు ఉన్నాయని తెలిపారు.

## బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో భారీ తొక్కిసలాట



**బెంగళూరు, జూన్ 4 (జనస్వరం) :** ఐపీఎల్ ట్రోఫీని గెలుచుకున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) విజయోత్సవ వేడుకల్లో విషాదం చోటు చేసుకుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన సంబరాల్లో పలువురు మృతి చెందగా, యాభై మందికి పైగా గాయపడ్డారు. జట్టు విజయోత్సవాల్లో పాల్గొనేందుకు భారీగా తరలివచ్చిన అభిమానులు ఒక్కసారిగా దూసుకురావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ దుర్ఘటనపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందించారు. తొక్కిసలాటలో ఎంతమంది మరణించారనే దానిపై ఇప్పుడే స్పష్టమైన సమాచారం ఇవ్వలేమని ఆయన తెలిపారు. "మృతుల వివరాలను ధృవీకరించాల్సి ఉంది. భద్రత కోసం 5,000 మందికి పైగా సిబ్బందిని ఏర్పాటు చేశాం. అయితే, అక్కడ ఉన్నది ఉత్సాహంతో ఉన్న యువత. వారిపై లాఠీఛార్జ్ చేయలేము కదా" అని డీకే శివకుమార్ అన్నారు. ఐపీఎల్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టు 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత విజేతగా నిలవడంతో నగరంలో ఏర్పాటు చేసిన సంబరాలు తీవ్ర విషాదంగా మారాయి. బుధవారం చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన విజయోత్సవ కార్యక్రమంలో భారీగా అభిమానులు తరలిరావడంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా, 30 మందికి పైగా గాయపడ్డారు. ఈ సంఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "బెంగళూరులో జరిగిన దుర్ఘటన అత్యంత హృదయ విదారకమైనది. ఈ విషాద సమయంలో, తమ ఆప్తులను కోల్పోయిన వారందరికీ నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను" అంటూ మోదీ సందేశాన్ని ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ ఇండియా) ఎక్స్ లో పోస్ట్ చేసింది.

## 5ఏళ్లలో సాధించలేని పెట్టుబడులు 11 నెలల్లోనే సాధించాం

**- 11 నెలల్లో 9.5లక్షల కోట్ల పెట్టుబడులు, 8.5 లక్షల ఉద్యోగాలకు ఒప్పందం**
**- పరిశ్రమలు ప్రారంభమయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ ఉండాలి**
**- ఒకవైపు పెట్టుబడుల ఆకర్షణ... మరోవైపు పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి**
**- ఉపాధి కల్పన మంత్రుల కమిటీ సమావేశంలో మంత్రి నారా లోకేష్**

**అమరావతి, జూన్ 4 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో సాధించలేని పెట్టుబడులను చంద్రబాబు నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం 11నెలల్లో సాధించిందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి, ఉపాధి కల్పన మంత్రుల కమిటీ చైర్మన్ నారా లోకేష్ అన్నారు. ఉండవల్లి నివాసంలో లోకేష్ అధ్యక్షతన 20లక్షల ఉద్యోగాలు, ఉపాధి కల్పనపై మంత్రులు, ఉన్నతస్థాయి అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 9.20లక్షల కోట్ల విలువైన 78భారీ పరిశ్రమలు, 13,895 కోట్ల విలువైన 1,19,580 చిన్న, మధ్యతరహా పరిశ్రమలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలోని యువతకు 8.5లక్షల ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. రాష్ట్రంలో భారీపెట్టుబడులు, అత్యధిక ఉద్యోగాల కల్పించేందుకు ముందుకు వచ్చిన ఎన్ టీసీపీ, బీపీసీఎల్, రిలయన్స్, టాటా పవర్ వంటి సంస్థలకు పరిశ్రమలవారీగా ఈడిబిలో ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ (పీఎంయూ)లను ఏర్పాటు చేసి, పరిశ్రమ స్థాపించేవరకు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు సంబంధించి భూమితోపాటు ఇతర మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన కల్పించాలన్నారు. అతిపెద్ద తీరప్రాంతం కలిగిన మన రాష్ట్రంలో పర్యాటకరంగంలో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని, బీచ్ టూరిజం అభివృద్ధిపై దృష్టిసారించాలని కోరారు.




విశాఖలో ఒబెరాయ్, వరణ్ బీచ్ శాండ్స్ వంటి స్టార్ హోటళ్ల నిర్మాణాలకు అవసరమైన అనుమతులతోపాటు ప్రభుత్వపరంగా పవర్, వాటర్ వంటి సదుపాయాలను సమకూర్చాలన్నారు. రాష్ట్రంలో బీచ్ శ్యాండ్, కోల్ గ్యాసిఫికేషన్ మైనింగ్ రంగాల్లో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలను అన్వేషించాలన్నారు. రాష్ట్రానికి కొత్తగా వచ్చే పరిశ్రమలకు అవసరమైన మానవవనరులను సమకూర్చేందుకు యువతకు నైపుణ్యశిక్షణ అందించాలని, స్కిల్ ఎకోసిస్టమ్ కల్పించాలన్నారు. బిసిసిఐ సహకారంతో అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో వరల్డ్ క్లాస్ స్టేడియం నిర్మాణానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని, దీనిద్వారా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు త్వరితగతిన అనుమతులు ఇచ్చేందుకు వీలుగా వాట్సాప్ గవర్నెన్స్ తో అనుసంధానం చేయాలన్నారు. (ప్రోగ్రామ్)తో అనుసంధానం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగూరి నారాయణ, కందుల దుర్గేష్, టిజి భరత్, కొండపల్లి శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్, పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్ యువరాజ్, టూరిజం శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్, ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు సిఇఓ సాయికాంత్ వర్మ, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఎపిఐఐసి ఎండి అభిషిక్త్ కిషోర్, ఎన్ఆర్ఈడీసీఏపీ విసి అండ్ ఎండి కమలాకర్ బాబు, గనులశాఖ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో జనాభా లెక్కలకు ముహూర్తం ఫిక్స్... ఈసారి ప్రత్యేకత ఏంటంటే...!

**- 2027 మార్చి 1 నుంచి దేశంలో తదుపరి జనాభా గణన**
**- 70 ఏళ్ల తర్వాత తొలిసారిగా కులాల వారీగా వివరాల సేకరణ**
**- జమ్మూ కాశ్మీర్, లడఖ్, ఉత్తరాఖండ్‌లో 2026 అక్టోబర్‌లోనే ప్రారంభం**
**- పారదర్శకత కోసమే కుల గణన అంటున్న కేంద్ర ప్రభుత్వం**
**- 2011 తర్వాత ఇదే మొదటి జనాభా లెక్కింపు, 2021లో కోవిడ్ వల్ల వాయిదా**

భారతదేశంలో తదుపరి దేశవ్యాప్త జనాభా గణన (సెన్సస్) 2027 మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభం కానుందని కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. ఈసారి సెన్సస్‌లో ఒక కీలక మార్పు చోటుచేసుకోనుంది. దాదాపు ఏడు దశాబ్దాల తర్వాత తొలిసారిగా కులాల వారీగా వివరాలను కూడా సేకరించనున్నారు. ఈ మేరకు సెన్సస్ చట్టం, 1948, మరియు సెన్సస్ నియమాలు, 1990 ప్రకారం రెండు దశల్లో ఈ ప్రక్రియను చేపట్టనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. కొన్ని ప్రత్యేక ప్రాంతాల్లో ఈ ప్రక్రియ ముందుగానే ప్రారంభం కానుంది. ముఖ్యంగా మంచుతో కప్పబడిన, ఏకకాలంలో గణన సాధ్యం కాని ప్రాంతాలైన లడఖ్, జమ్మూ కశ్మీర్‌లోని కొన్ని భాగాలు, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో 2026 అక్టోబర్ నుంచే జనాభా గణన మొదలవుతుంది. ఈ ప్రాంతాలకు 2026 అక్టోబర్ 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటలను రిఫరెన్స్ తేదీగా నిర్ణయించారు. మిగిలిన దేశానికి 2027 మార్చి 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటలు రిఫరెన్స్ తేదీగా ఉంటుంది. ఈ రిఫరెన్స్ తేదీలను వివరిస్తూ అధికారిక ప్రకటన 2025 జూన్ 16న అధికారిక గెజిట్‌లో ప్రచురితమయ్యే అవకాశం ఉంది. కులాల వివరాలను జనాభా గణనలో చేర్చాలన్న నిర్ణయాన్ని ఏప్రిల్ 30న జరిగిన రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశం అనంతరం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ధృవీకరించారు. ఈ చర్య పారదర్శకతను, జాతీయ స్థాయిలో ఏకరూపతను తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకుందని ఆయన తెలిపారు. "కొన్ని రాష్ట్రాలు కుల సర్వేలను పారదర్శకంగా నిర్వహించాయి, కానీ మరికొన్ని అలా చేయలేదు. ఈ వ్యత్యాసాలు సందేహాలకు తావిచ్చాయి, సామాజిక సామరస్యానికి భంగం కలిగించే అవకాశం ఉంది" అని వైష్ణవ్ పేర్కొన్నారు.

భారతదేశంలో చివరిసారిగా 2011లో జనాభా గణన జరిగింది. ఆ తర్వాత 2021లో జరగాల్సిన సెన్సస్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయి, 2020 ఏప్రిల్ 1 నుంచి క్షేత్రస్థాయి పనులు ప్రారంభం కావాల్సి ఉండగా, కోవిడ్-19 మహమ్మారి వ్యాప్తి కారణంగా నిరవధికంగా వాయిదా పడింది. 2011 జనాభా గణన రెండు దశల్లో జరిగింది. ఇంటింటి గణన, గృహ గణన ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ 2010 వరకు, జనాభా లెక్కింపు ఫిబ్రవరి 2011లో జరిగాయి. రాబోయే జనాభా గణనలో కులాల వివరాలను చేర్చడం ఒక చరిత్రాత్మక పరిణామంగా పరిగణిస్తున్నారు. బ్రిటిష్ వారి హయాంలో 1881 నుంచి 1931 మధ్య చివరిసారిగా సమగ్రమైన కులాల వారీ గణన జరిగింది. 2011లో యూపీఏ ప్రభుత్వం సామాజిక-ఆర్థిక కుల గణన (SECC) చేపట్టి, కులాల సమాచారాన్ని సేకరించినప్పటికీ, ఆ డేటాను పూర్తిగా ప్రచురించడం గానీ, ఉపయోగించడం గానీ జరగలేదు. పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పూనమ్ ముత్రేజా మాట్లాడుతూ, సమాజంలో లోతుగా పాతుకుపోయిన నిర్మాణాత్మక అసమానతలను వెలికితీయడానికి, సమ్మిళిత విధానాలను రూపొందించడానికి కుల గణన చాలా అవసరమని గతంలో అభిప్రాయపడ్డారు.



## జీవితం - వి "చిత్రం"




## ఈరోజు పంచాంగం వేళలు

తేదీ : 05 జూన్ 2025
తిథి : శుద్ధ దశమి ( ఉ : 2.01 వరకు )
నక్షత్రం : ధనిష్ట ( తె 5.52 వరకు )
బ్రహ్మముహూర్తం : తె 5.16 నుండి తె 6.01 వరకు
రాహుకాలం : ఉ 11.08 నుండి మ 12.33 వరకు
యమగండం : మ 3.24 నుండి సా 4.49 వరకు
వర్జ్య కాలం : మ 12.37 నుండి మ 2.17 వరకు

## ఈరోజు నమాజ్ వేళలు

తేదీ : 05 జూన్ 2025
ఫజర్ : 5.35 ఉదయం
సూర్యోదయం : 6.48 ఉదయం
జొహార్ : 12.34 మధ్యాహ్నం
అసర్ : 3.52 సాయంత్రం
మగ్రిబ్ : 6.19 సాయంత్రం
ఇష : 7.32 సాయంత్రం







# పర్యావరణ పరిరక్షణ.. భవిష్యత్తుకు రక్షణ

## ఎడిటోరియల్

నేడు జూన్ 5 – ప్రపంచ పర్యావరణ దినోత్సవం. ఇది ఒక సాధారణ తేదీ కాదు, మన భవిష్యత్తును గుర్తుచేసే హెచ్చరిక. ప్రకృతి మీద మన ఆధారత ఎంత ఉందో, దాన్ని ఎలా నిర్లక్ష్యం చేస్తున్నామో స్ఫురణ చేసే రోజు. మానవుడు సాంకేతికంగా ఎంత ఎత్తులకు ఎదిగినా, ఆధునికతను ఎంత ఆరాధించినా – ప్రకృతి లేకుండా ఒక్క క్షణం జీవించలేడు. అయినా నేటి ఉత్సాహాలన్నీ ప్రకృతిని నాశనం చేసే దిశగా సాగుతున్నాయి. ఇదే కొనసాగితే మన జీవితాలే మబ్బులా మారిపోతాయి.

**ఐక్యరాజ్య సమితి సదస్సు నుంచి ఈ దినోత్సవం దిశగా:**

1972లో స్టాక్‌హోమ్‌లో జరిగిన ఐక్యరాజ్య సమితి "మానవ పర్యావరణ సదస్సు"లో ప్రపంచ దేశాలు పర్యావరణ పరిరక్షణపై ఒకే అభిప్రాయానికి వచ్చాయి. 1973లో మొదటిసారిగా "ఓన్లీ వన్ ఎర్త్" అనే థీమ్‌తో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందేశం మరింత స్పష్టంగా చెబుతుంది – మనకు ఒకే భూమి ఉంది. అది చెడితే మనం ఎవ్వరూ మిగలం.

**2025 థీమ్ — ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలన :**

ఈ ఏడాది పర్యావరణ దినోత్సవం థీమ్ – "ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం". పరిశుభ్రత, పునర్వినియోగం, సమిష్టి బాధ్యత, పర్యావరణ న్యాయాన్ని ఈ థీమ్ కేంద్రంగా ఉంచుకుని, ప్రపంచాన్ని మేల్కొలుపుతోంది. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్మెంట్



ప్రోగ్రామ్ (UNEP) ఈ దినోత్సవానికి నాయకత్వం వహిస్తోంది.

**2025 ఆతిథ్య దేశం : దక్షిణ కొరియా.**

అందమైన జెజు ద్వీపంలో ఈ వేడుకలు జరుగుతున్నాయి. 2040 నాటికి పూర్తి ప్లాస్టిక్ నిషేధం లక్ష్యంగా దక్షిణ కొరియా పనిచేస్తోంది. చెత్త వేరు చేయడం, రీసైక్లింగ్ పెంపొందించడం, పర్యావరణ పర్యాటకానికి పురిగొల్పే విధానాలు అక్కడ ఆదర్శంగా నిలుస్తున్నాయి.

**ప్లాస్టిక్ కాలుష్యం — మానవాళికి ముప్పు :**

- ప్రపంచవ్యాప్తంగా ఏటా 11 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ చెత్త నీటిలోకి చేరుతోంది.
- భారతదేశంలో ఏటా 9.4 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి.
- చెత్త నిర్వహణపై నియంత్రణ లేకపోవడం, మైక్రోప్లాస్టిక్‌లు నేలలో పేరుకుపోవడం వల్ల భూ, నీటి కాలుష్యం తీవ్రరూపం దాలుస్తోంది. సముద్ర జీవులు ప్లాస్టిక్‌ను తినడం వల్ల ఆ వ్యవస్థ అస్తవ్యస్తమవుతోంది.

దీనివల్ల ప్రతి సంవత్సరం 5.8 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ కాల్చడం ద్వారా విపరీతమైన విషవాయువులు విడుదలవుతున్నాయి. ఇది జీవుల ఆరోగ్యాన్ని హానిచేస్తోంది. అంతేకాదు, ప్రపంచ ఆర్థికానికి $300-600 బిలియన్ నష్టం వాటిల్లుతోంది.

**మన బాధ్యత — మన చర్యలు :**

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకం. మనం నిత్యం చేసే చిన్నచిన్న చర్యలు, భవిష్యత్‌లో పెద్ద మార్పులకు దారితీయగలవు

**ఒకసారి వాడదగిన ప్లాస్టిక్‌ను నిషేధించాలి :**

- పునర్వినియోగదగిన వస్తువులను ప్రోత్సహించాలి
- జ్యూట్/కాటన్ బ్యాగులు వాడాలి
- చెత్తను వేరు చేసి వేయాలి – జీవ, భౌతిక, రీసైకిలబుల్ వ్యర్థాలుగా
- మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలి
- స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాల్లో పాల్గొనాలి
- పిల్లలకు చిన్ననాటినుంచే పర్యావరణ బాధ్యత నేర్పాలి
- వ్యవసాయంలో రసాయనాల వాడకాన్ని తగ్గించాలి
- అడవుల పరిరక్షణ, పచ్చదనం పెంపుతో పాటు, ఎలక్ట్రిక్ వాహనాలు వాడేందుకు కృషి చేయాలి

ఈ చర్యలు సమష్టిగా సమర్థంగా అమలైతే, పర్యావరణ పరిరక్షణ సాధ్యమే.

**సమష్టి బాధ్యత — సమిష్టి కృషి అవసరం :**

ప్రభుత్వాలు విధానాలను రూపొందించాలి. పరిశ్రమలు పరిష్కారాలను స్వీకరించాలి. సంస్థలు అవగాహన కల్పించాలి. ప్రజలంతా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ఇదే మార్గం మన భూమిని కాపాడేందుకు. మన సాంకేతికత మనల్ని చంద్రుడిపైకి తీసుకెళ్లగలదు. కానీ మన భూమిని కాపాడుకునే మార్గం మాత్రం ఒక్కటే – పర్యావరణ పరిరక్షణ. ఈ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతీ మనిషి ఒక ప్రతిజ్ఞ తీసుకుందాం – ప్రకృతిని కాపాడే ప్రతి చర్య మన భవిష్యత్తుకే పెట్టుబడిగా మలుచుకుందాం.

నేచర్ లేనిదే ఫ్యూచర్ లేదు.

**— జి. అజయ్ కుమార్**



# కూటమి ప్రభుత్వానికి ఏడాది - తిరుమలపాలెంలో ఘనంగా సంబరాలు

**తిరుమలపాలెం, జూన్ 4 (జనస్వరం జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా, సర్వేపల్లి నియోజకవర్గంలోని తిరుమలపాలెంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ నాయుడు మాట్లాడుతూ, "రాష్ట్రాన్ని రాక్షస పాలన నుండి విముక్తి చేసి అవినీతి, అప్రజాస్వామ్య ధోరణులకు ముగింపు పలికిన ప్రజా ప్రభుత్వం ఈరోజు సరిగ్గా ఏడాది పూర్తి చేసుకుంది" అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత కాలంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయని, రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, వైజాగ్ స్టీల్ ప్లాంట్ వంటి కీలక రంగాల్లో తిరిగి నూతన శక్తిని అందించామని తెలిపారు. గత ప్రభుత్వం అవినీతి పాలనను నడిపి యువతను చెడు మార్గాలకు నెట్టేసిందని, రైతులకు గిట్టుబాటు ధరలు లేక రాజధాని కనపడని రాష్ట్రంగా మార్చిందని తీవ్రంగా విమర్శించారు. "జగన్మోహన్ రెడ్డి పరిపాలన కేవలం అవినీతికి, అక్రమాలకు, మాయాజాలాలకు మిక్స్ అయిన పాలనగా నిలిచింది. ప్రజలు ఇప్పుడు నిజమైన ప్రజా పాలనను అనుభవిస్తున్నారు," అని ఆయన విమర్శించారు. ఈ ఏడాది కాలంలో రాష్ట్రానికి పెట్టుబడులు రాగా,



సంక్షేమ పథకాలు ప్రజల చెంతకు చేరాయని చెప్పారు. అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టిన కూటమి ప్రభుత్వం, భావితరాలకు స్వర్ణాంధ్రాన్ని అందించే దిశగా కృషి చేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణి భవాని నాయుడు, జనసేన నేతలు పినిశెట్టి మల్లికార్జున్, మండల కార్యదర్శి సందూరి శ్రీహరి, చల్లా చెంచయ్య, మణి, ముత్తుకూరు మండల సీనియర్ నాయకులు రహీం, అక్బర్, చిన్నతో పాటు పలువురు స్థానిక మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# జూన్ 4 ప్రజాస్వామ్యానికి కొత్త దిశనిచ్చిన రోజు

**- మంత్రి అచ్చెన్నాయుడు**

**అమరావతి, జూన్ 4 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తైన సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రజలకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. జూన్ 4వ తేదీని ప్రజాస్వామ్యానికి కొత్త దిశనిచ్చిన రోజుగా ఆయన అభివర్ణించారు. "ప్రజల ఆశయాలకు అనుగుణంగా, ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అభివృద్ధి దిశగా రాష్ట్రాన్ని నడిపిస్తోంది. ప్రజల మద్దతుతో ఏర్పడిన ఈ ప్రభుత్వం పారదర్శక పాలనకు, శ్రద్ధకు, ప్రజాసేవకు సంకేతంగా మారింది" అని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనపై విమర్శలు చేస్తూ, అప్పుల ఊబిలో మగ్గిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన తెలిపారు. కేవలం ఏడాదిలోనే 700కు పైగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రారంభించామని, వృద్ధులకు పింఛన్ రూ.3 వేల నుండి రూ.4 వేలకు పెంచినట్లు, 204 అన్న



క్యాంటీన్లు తిరిగి ప్రారంభించినట్లు, 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 24 గంటల్లో డబ్బులు చెల్లించినట్లు వివరించారు. అలాగే, 16,347 టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ జారీ, 20 వేల కి.మీ రోడ్ల మరమ్మతులు, రాజధాని నిర్మాణం పునఃప్రారంభం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, ఉచిత విద్యుత్, వ్యవసాయానికి రాయితీలు, మత్స్యకారులకు రూ.20 వేలు నష్టపరిహారం లాంటి పథకాలతో ప్రభుత్వం ప్రజల మద్దతును నిలబెట్టుకుందన్నారు. "పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొంది. రైతు ముఖంలో చిరునవ్వు, యువతకు ఉపాధి, మహిళలకు భద్రత, విద్యార్థులకు నాణ్యమైన విద్య, ప్రజలకు మెరుగైన ఆరోగ్యం అందుతోంది. ఇది కేవలం ప్రభుత్వ విజయమే కాదు... ప్రజల భాగస్వామ్యంతో సాధించిన ప్రగతి," అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములై ఉండాలని కోరుతూ, తెలుగు ప్రజల ప్రతిష్టను ప్రపంచానికి చాటుదామన్నారు.

# పోలీస్ కమిషనర్ బదిలీ చర్చలపై అలజడి : సీఎం తక్షణం స్పందించాలి

**భీమిలి, జూన్ 4 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** విశాఖ పోలీస్ కమిషనర్ శంకభత్ర బాగ్చీని బదిలీ చేయాలని ఒక కీలక ఎమ్మెల్యే చేస్తున్న ప్రయత్నాలు ప్రమాదకర పరిస్థితులకు దారి తీసే అవకాశం ఉందని, ఆయనను కొనసాగించాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్ చేశారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం పోలీస్ కమిషనర్ కారణంగా విశాఖలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని, క్రైమ్ రేటు తగ్గిందని పేర్కొన్నారు. "ఇటీవల విశాఖలో జరిగిన దాడి ఘటనపై నేను పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినప్పుడు ఆయన స్పందించి ఏసీపీకి చెప్పినా, స్థానిక ఎమ్మెల్యే ఒత్తిడితో కేసు నమోదు కాలేదు. ఇది పోలీస్ వ్యవస్థపై అప్రతిష్ట కలిగించే విషయం. సీపీ ఆదేశాలను పట్టించుకోకుండా, ఆయన్నే మారుస్తున్నామని ప్రచారం చేస్తున్న నేతల లక్ష్యం స్పష్టం," అని బి.వి.రామ్ విమర్శించారు. విశాఖలో ఒక టీడీపీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు మాఫియా మాదిరిగా ప్రవర్తిస్తూ పోలీస్ స్టేషన్లను తమ స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. "శంకభత్ర బాగ్చీ ఆదేశాల మేరకు పోలీసులు సమర్థంగా పని చేస్తున్నారు. ఆయన ప్రజలకు అందుబాటులో ఉండే అధికారి. ఇలాంటి అధికారిని మార్చితే ప్రజల్లో భద్రతపై నమ్మకం పోతుంది. ఆయనను కనీసం మరో రెండేళ్లు కొనసాగించాలి," అని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు.



**ఎన్టీఆర్ జయంతి జీఓపై పల్లా శ్రీనివాస్ పాత్రపై వివరణ కోరాలి :** తెలుగు దేశం పార్టీ స్థాపకుడు ఎన్టీఆర్ జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం విడుదల చేసిన జీఓ విషయంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ పాత్ర ఉందని ప్రచారం జరుగుతోందని బి.వి.రామ్ విమర్శించారు. "మూడు నెలలుగా తెలుగు శక్తి ఎన్టీఆర్ జయంతిని అధికారికంగా జరపాలని ప్రభుత్వాన్ని కోరుతోంది. కానీ ఇప్పుడు పల్లా అనుచరులు ఈ జీఓ తమ నాయకుడి వలన వచ్చిందని ప్రచారం చేయడం దుర్మార్గం," అన్నారు. ఈ జీఓ వెనుక నిజమైన కృషి ఎవరిదో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. "తెలుగు వారిపట్ల గౌరవం చూపించే అంశాన్ని కూడా రాజకీయ ప్రచారంగా మలచడం అన్యాయమయ్యే విధంగా మారిందని" ఆయన వ్యాఖ్యానించారు.

# జనవాణీకి ప్రజల నుంచి విశేష స్పందన

**మంగళగిరి, జూన్ 4 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** జనసేన భరోసా కార్యక్రమం కింద నిర్వహిస్తున్న జనవాణీకి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ రెడ్డి అప్పల నాయుడు తెలిపారు. బుధవారం మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 20కు పైగా సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉభయగోదావరి కోఆర్డినేటర్ కసిరెడ్డి మధులత, పశ్చిమ గోదావరి సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా పాల్గొన్నారు. స్వీకరించిన అర్జీలను సంబంధిత నియోజకవర్గ అధికారులకు పంపి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని అప్పల నాయుడు తెలిపారు. "జనవాణీ ద్వారా ప్రజల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతున్నాయి. గౌరవ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆలోచన ప్రజలకు భరోసానిస్తోందని" అన్నారు.

**కూటమి పాలన అభివృద్ధి దిశగా పయనం.. :**

అనంతరం మాట్లాడిన అప్పల నాయుడు, గత వైసీపీ పాలనపై తీవ్రంగా విమర్శలు చేశారు. "జగన్ రెడ్డి నియంత పాలనతో ప్రజాస్వామ్యాన్ని అణిచిపెట్టారు. అసెంబ్లీలో గూండాయిజం



ప్రదర్శించి, మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేసిన నేతలకు ప్రజలు తగిన శిక్ష విధించారు," అని ఆరోపించారు. ఇదే సందర్భంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సంక్షేమ, అభివృద్ధి, ఉపాధి రంగాల్లో ముందడుగు వేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని మోడీ నేతృత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందన్నారు. తెనాలిలో జగన్ రెడ్డి క్రిమినల్స్‌కు మద్దతుగా నిలవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మీడియా ఇంచార్జ్ జనసేన రవి తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే 30 ఏళ్లు రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందుతుంది

**- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**

**- జనసేన ఆధ్వర్యంలో ఘనంగా "సుపరిపాలన మొదలై ఏడాది - పీడ విరగడై ఏడాది" కార్యక్రమం**

**విజయవాడ, జూన్ 4 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి):** రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరానికి పురస్కరించుకొని "సుపరిపాలన మొదలై ఏడాది – పీడ విరగడై ఏడాది" పేరుతో విజయవాడ ఇస్కాన్ టెంపుల్ వద్ద నిర్వహించిన వేడుకలు ప్రజల్లో ఉత్సాహాన్ని రేకెత్తించాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొని, ప్రజలతో కలిసి ముగ్గుల పోటీలు, శాస్త్రీయ నృత్యాలు, కేక్ కటింగ్ వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, "రాబోయే ముప్పై సంవత్సరాలు కూడా ఎన్డీయే కూటమి పాలన రాష్ట్రానికి మేలు చేస్తుంది. మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ల నాయకత్వం అభివృద్ధి మార్గాన్ని మరింత వేగవంతం చేస్తోంది," అని పేర్కొన్నారు. జగన్ పై తీవ్ర విమర్శలు చేస్తూ, "వివేకానంద రెడ్డిని హత్య చేసిన వ్యక్తిగా ప్రజలు జగన్ పై నమ్మకాన్ని కోల్పోయారు. సొంత కుటుంబ సభ్యులపై కన్నెర్ర చూపిన వ్యక్తికి మద్యం స్కాంలో తప్పకుండా జైలు జీవితం ఎదురవుతుంది," అని విమర్శించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, గత ఏడాది ఇదే రోజున ప్రజలు ఇచ్చిన తీర్పు చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. "నేరపూరిత పాలనకు ప్రజలు చెక్ పెట్టారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నాయకత్వం రాష్ట్రానికి అవసరమని ప్రజలు గట్టి సంకేతం ఇచ్చారు," అన్నారు.




ఈ వేడుకలో జనసేన తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అమ్మిశెట్టి వాసు, కార్పొరేషన్ చైర్మన్లు చిలకలపూడి పాపారావు, పేరేపి ఈశ్వర్, కార్పొరేటర్లు ఉమ్మడిశెట్టి రాధిక, ముమ్మనేని ప్రసాద్, టిడిపి రాష్ట్ర నాయకులు గన్నె ప్రసాద్, ఏపీఐఐసీ డైరెక్టర్ మండల రాజేష్, బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన రోజు పట్ల ప్రజల్లో పండుగ వాతావరణం కనిపించింది. వైసీపీ దుర్వినియోగ పాలనకు ముగింపు పలికి, ఎన్డీయే కూటమి ద్వారా ఒక మంచి ప్రారంభం వచ్చిందని ప్రజలు భావిస్తున్నారు. పారదర్శక పాలన, అభివృద్ధికి కట్టుబడి ఉన్న విధానాల వల్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతున్నదని నాయకులు పేర్కొన్నారు.

# తుడా టవర్స్ నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యం


**తిరుపతి, జూన్ 4 (జనస్వరం) :** నగర నడిబొడ్డున నిర్మితమవుతున్న తుడ టవర్స్ ను త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని "తుడ" చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం తుడా అధికారులతో కలిసి ఆయన తుడా టవర్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పక పాటించాలని సూచించారు. అదేవిధంగా నిబంధనలకు అనుగుణంగా నిర్మాణం జరగాలన్నారు. తుడా టవర్స్ రైల్వే స్టేషన్, బస్టాండుకు సమీపంలో ఉండడం వల్ల డిమాండ్ అధికంగా ఉందని పేర్కొన్నారు. ఎక్కడ రాజీ పడకుండా నిర్ణీత గడువులోపు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ శ్రీకాంత్, సూపరిండెంట్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీంద్ర, డిఈ భాష, ఏఈ షణ్ముగం, కేపిసి కాంట్రాక్టర్ సుశీల్ ఇతర ఇంజనీర్లు పాల్గొన్నారు.



# గ్రీవెన్స్ కార్యక్రమంలో బాధితుల ఆవేదన

**— వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరణ**

**అమరావతి, జూన్ 4 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి):** తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుండి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. తమ సమస్యలను మాజీ మంత్రి పీతల సుజాత, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె సుబ్బారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. అర్జీలను స్వీకరించిన నేతలు, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వివరిస్తూ అధికారుల నిర్లక్ష్యం, వ్యవస్థల వైఫల్యాన్ని ఎత్తిచూపారు. విశాఖపట్నంలోని వెంకటాపురం ప్రాంతంలో గ్యాస్ లీక్ ఘటన తర్వాత మూసివేసిన ఎల్జీ పాలిమర్స్ కంపెనీ వల్ల 350 మంది కాంట్రాక్ట్ కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారని బాధితులు తెలిపారు. కంపెనీని తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని లేదా కార్మికులకు నష్టపరిహారం చెల్లించేలా చూడాలని ల్యాండ్ లూజర్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున విజ్ఞప్తి చేశారు. ఇక పల్నాడు జిల్లా గోకనకొండ గ్రామానికి చెందిన అమృతపూడి చిన్న రూబెన్ తన ఇంటి ఎదుట వ్యర్థాలు వేస్తూ దాడులకు పాల్పడ్డారని, కులపేరుతో దూషించారని తెలిపారు. గతంలో ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయలేదని, ఈసారి తప్పకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుపతి జిల్లా జంగలపల్లి గ్రామానికి చెందిన వాసుదేవయ్య, తానిచ్చిన ఆస్తి ఉన్నప్పటికీ కోడలు కిరాయి గుండాలతో తమపై కత్తులతో దాడి చేయిస్తోందని ఆరోపించారు. ప్రాణభయంతో పోలీసులు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతపురం జిల్లా ముస్తాపురం గ్రామానికి చెందిన ముప్పాళ్ల శ్రీమన్నారాయణ, పంచాయతీ రోడ్డును తవ్వి పొలంగా మార్చుకున్నారని కంటా యానాదయ్యపై ఫిర్యాదు చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. పల్నాడు జిల్లా పమిడిపాడు గ్రామానికి చెందిన పిన్నెబోయిన అనిల్ కుమార్, తమ తల్లిదండ్రుల పేరున్న భూమిని గత ప్రభుత్వం సమయంలో స్థానిక నాయకుల జోక్యంతో రెవెన్యూ రికార్డుల్లోంచి తొలగించారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు ప్రాంతానికి చెందిన వెదుళ్ల నరసింహారావు తన తండ్రి పంచిన ఆస్తిని అన్న, వదినలు దొంగ పత్రాల ద్వారా హస్తగతం చేసుకుని అమ్మేశారని తెలిపారు. దీనిపై న్యాయపరంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజలు ఉత్కంఠతో తమ సమస్యలు వివరిస్తూ, తమకు న్యాయం జరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.



# భూభారతి సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ ప్రతీక్ జైన్

**బొంరాస్ పేట, జూన్ 4 (జనస్వరం) :** రైతుల భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి, రేగడిమైలారం గ్రామాల్లో ఈరోజు రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించి గ్రామస్తులతో, లబ్ధిదారులతో ముఖాముఖీ మాట్లాడారు. రేగడిమైలారం గ్రామంలో నిర్వహించిన సదస్సులో మొత్తం 32 దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ పద్మవతి తెలిపారు. అనంతరం కలెక్టర్ ఇందిరమ్మ హౌసింగ్ లబ్ధిదారులను కలసి వారి ఇండ్ల నిర్మాణ పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "ఇందిరమ్మ ఇండ్లకు మంజూరైన పత్రాలు పొందిన ప్రతి ఒక్కరూ తక్షణమే నిర్మాణాన్ని ప్రారంభించాలి. నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి. భూభారతి చట్టం



ద్వారా రైతులకు అవసరమైన సేవలు వేగంగా అందించాల్సిన బాధ్యత రెవెన్యూ శాఖపై ఉంది. పాస్ పుస్తకాలు పంపిణీ చేయడంతో పాటు, ఇతర సమస్యల పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్య




నాయక్, ఎమ్మార్వో పద్మవతి, ఆర్ఐ శిరీష, సూపరింటెండెంట్ వెంకన్ గౌడ్, ఎంపీ ఓ. రవి నాయక్, పంచాయతీ కార్యదర్శి బసంత్ రెడ్డి తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మూ డుగ్రామాల ప్రజల పోరాటం ఫలించింది : తాగునీటి సమస్యకు పరిష్కారం

**చిలకలూరిపేట, జూన్ 4 (జనస్వరం) :** నియోజకవర్గంలోని మానుకొండవారిపాలెం, గణపవరం గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ చర్యలు ప్రారంభించింది. మొత్తం రూ.56 లక్షల జడ్పీ నిధులు మంజూరు అయ్యాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "గత పాలకుల అనాలోచిత నిర్ణయాలతో మున్సిపాలిటీ పరిధిలోకి లాంఛనంగా విలీనం చేసిన మానుకొండవారిపాలెం, గణపవరం, పసుమర్రు గ్రామాల ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారు. నూతన పాలకులైన టీడీపీ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం, ప్రత్తిపాటి గారి చొరవతో ఈ సమస్యలు ప్రభుత్వ దృష్టికి వెళ్లాయి. ముఖ్యంగా మానుకొండవారిపాలెంలో రూ.40లక్షల లీటర్ల సామర్థ్యంతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం, గణపవరం గ్రామంలో తాగునీటి ఫిల్టర్ బెడ్ల ఏర్పాటుకు అవసరమైన సౌకర్యాలు, ఈ మేరకు ఇటీవల రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ స్వయంగా చిలకలూరిపేటకు వచ్చి గ్రామాల్లో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు పరిశీలించిన ఆయన, తాగునీటి సమస్య తీవ్రతను గుర్తించి, వెంటనే నిధులు మంజూరు చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతిబసుకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.56 లక్షల విలువైన అభివృద్ధి పనులకు జడ్పీ నిధులు కేటాయించబడ్డాయి. త్వరలోనే టెండర్లు ఖరారవుతున్నట్లు జిల్లా పరిషత్ కార్యాలయ వర్గాలు ధృవీకరించాయి. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పనులు వేగంగా ప్రారంభించనున్నట్లు సమాచారం. ప్రజా పోరాటం



ఫలితంగా మానుకొండవారిపాలెం, గణపవరం గ్రామాలకు తాగునీటి సమస్య నుంచి ఉపశమనం లభించనుండటం పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. "ఇది మా దీర్ఘకాలిక డిమాండుకు న్యాయం జరిగినట్లే," అని పలువురు గ్రామ పెద్దలు వ్యాఖ్యానించారు.

# స్విమ్స్ ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం

**- ఉద్యోగుల అవగాహన సదస్సులో డైరెక్టర్**

**తిరుపతి, జూన్ 4 (జనస్వరం) :** స్థానిక శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) లో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగుల హక్కులను పరిరక్షించేందుకు తొలి ప్రాధాన్యత ఉంటుందని పలువురు వక్తలు స్పష్టం చేశారు. స్విమ్స్ లో పనిచేస్తున్న శ్రీ లక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ ఉద్యోగులకు ఇ.ఎస్.ఐ., ఇ.పి.ఎఫ్ అంశాలపై శ్రీపద్మావతి ఆడిటోరియంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.వి. కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్, ఆర్ఎంఓ డా. వెంకట కోటిరెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ డా. సునీత, రీజినల్ పి.ఎఫ్ కమిషనర్ బి.టి.సతీష్ కుమార్, స్విమ్స్ జనరల్ మేనేజర్ రవీంద్రబాబు, తిరుపతి ఇ.ఎస్.ఐ.సి అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ, ఎంప్లాయిస్ జనరల్ సెక్రటరీ మురళీధర్, మెంబెర్ ఫర్ రీజినల్ అడ్వైసర్ కమిటీ నేషనల్ బోర్డు ఫర్ వర్కర్స్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్మెంట్ లేబూరి రత్నకుమార్ సంయుక్తంగా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా విచ్చేసిన స్విమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ... ఉద్యోగులకు, కార్మికులకు బాధ్యతలతో పాటు హక్కులపై అవగాహన అవసరమని అన్నారు. ఇ.ఎస్.ఐ. అండ్ ఇ.పి.ఎఫ్ లలో సభ్యులుగా చేరిన వారికి అనేక లాభాలు ఉన్నాయని, హక్కులపై అవగాహన పెంచుకొని ప్రతి ఒక్కరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ విషయంలో స్విమ్స్ లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు తన సంపూర్ణ సహకారం వుంటుందని పేర్కొన్నారు. రీజినల్ పి.ఎఫ్ కమీషనర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాను కలిగి వుంటారని, దీని వలన ఉద్యోగుల జీతం నుండి కొంత మొత్తం పిఎఫ్ ఖాతాకు చేరుతుంది. అదే విధంగా సంస్థ సైతం పెన్షన్ స్కీమ్ తో పాటు పిఎఫ్ ఖాతాకు జమ చేస్తుందని, పిఎఫ్ ఖాతాదారులకు పదవీ విరమణ చేసిన తర్వాత పెన్షన్ బెనిఫిట్స్ కూడా




వుంటాయని తెలియజేశారు. తిరుపతి ఇఎస్ఐసి అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ.. ఇ.ఎస్.ఐ గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి వుండాలని, మెడికల్ బెనిఫిట్స్ గురించి తప్పక తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ కార్పొరేషన్ల ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీబీ చైర్మన్ బాధ్యతలు స్వీకరణ

**చిత్తూరు, జూన్ 4 (జనస్వరం) :** చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) చైర్మన్ గా అమాస రాజశేఖర రెడ్డి బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈమేరకు చిత్తూరులోని జిల్లా కేంద్ర కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అమాస రాజశేఖర్ రెడ్డికి ఆయన స్నేహితులు, శ్రేయోభిలాషులు, టీడీపీ శ్రేణులు శాలువలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. వారిలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, బీజేపీ నేత నవీన్ కుమార్ రెడ్డి, టీడీపీ నేతలు దొరబాబు, మోహన్ రాజ్, చిట్టిబాబు తదితరులు ఉన్నారు. డిసిసిబి చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన వెంటనే జిల్లా రైతాంగానికి సంబంధించిన ఫైలుపై మొదటి సంతకం చేసి ప్రసంగిస్తూ జిల్లా రైతాంగానికి అన్ని వేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత.. మంత్రి అయిన నారా లోకేష్ తనకు అప్పజెప్పిన పదవిని ఓ బాధ్యతగా స్వీకరించి పనిచేస్తానన్నారు. ఇందులో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ప్రజా ప్రతినిధులను కలుపుకొని, వారి సూచనలను - సలహాలను పరిగణలోకి తీసుకొని జిల్లా రైతాంగానికి మేలు కలిగేలా పాలన సాగిస్తానన్నారు. ముఖ్యంగా పార్టీ పటిష్టతకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా డిసిసిబి అధ్యక్షునిగా బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ నేత చినబాబు, పార్లమెంటు ఇన్ చార్జ్ సి.ఆర్.రాజన్, తిరుపతి కో ఆపరేటివ్ బ్యాంకు మాజీ డైరెక్టర్లు భువన్ కుమార్, ఆనంద్ యాదవ్, రామమూర్తి రాయల్, బాలసుబ్రమణ్యం



రెడ్డి, మునిరామయ్యలతో పాటు తిరుపతి, చంద్రగిరి, నగరి, చిత్తూరు, శ్రీకాళహస్తి, పీలేరు నుంచి భారీ సంఖ్యలో ఎన్డీఏ కూటమి పార్టీ సీనియర్ నాయకులు, శ్రేయోభిలాషులు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.

# రేపటి నుంచే అలిపిరిలో దివ్య దర్శనం టోకెన్ల కౌంటర్లు

**తిరుపతి, జూన్ 4 (జనస్వరం):** శ్రీవారిని దర్శించేందుకు కాలినడకన తిరుమల బయలుదేరే భక్తుల సౌకర్యార్థం, శ్రీవారి మెట్టు వద్ద టోకెన్ల జారీ కౌంటర్లను తాత్కాలికంగా అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌కు మార్చాలని టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త టోకెన్ కౌంటర్లు జూన్ 6వ తేదీ శుక్రవారం సాయంత్రం నుంచి భక్తులకు సేవలందించనున్నాయి. ఈ విషయాన్ని టీటీడీ ఈఓ జె. శ్యామలరావు అధికారులతో నిర్వహించిన వర్చువల్ సమీక్షలో వెల్లడించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా భద్రత, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాల్లో సమన్వయం కోసం సంబంధిత అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షలో తీసుకున్న ప్రధాన నిర్ణయాల ప్రకారం, భక్తుల రద్దీని నియంత్రించేందుకు శ్రీవారి మెట్టు వద్ద టోకెన్ల జారీని భూదేవి కాంప్లెక్స్‌కు తరలిస్తున్నారు. టోకెన్లు "ముందు వచ్చిన వారికి ముందు" అనే విధానంపై జారీ చేయబడతాయి. ఆధార్ ఆధారంగా టోకెన్ పొందిన భక్తులు తిరుమల ప్రయాణంలో 1200వ మెట్టు వద్ద టోకెన్‌ను స్కాన్ చేయాల్సి ఉంటుంది. శనివారం దర్శనానికి అవసరమైన టోకెన్లు శుక్రవారం సాయంత్రమే ఇవ్వనున్నారు. ఎస్ఎస్‌డి దర్శన టోకెన్లకూ భూదేవి కాంప్లెక్స్ లోనే ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే, క్యూలైన్లు, అన్నప్రసాదం పంపిణీ, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టేందుకు చర్యలు చేపట్టారు. ఈఓ శ్యామలరావు మాట్లాడుతూ, "అలిపిరిలో టోకెన్ల కౌంటర్ల కార్యకలాపాలు సమర్థవంతంగా సాగేందుకు ప్రత్యేక అధికారుల బృందాన్ని నియమించాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. శ్రీవారి సేవకులను కూడా విస్తృతంగా వినియోగించాలని ఆదేశించాం," అని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో టిటిడి అదనపు ఈవో సిహెచ్. వెంకయ్య చౌదరి, తిరుపతి జేఈవో వీ. వీరబ్రహ్మం, టిటిడి ఇన్‌చార్జి సీవీఅండ్ఎస్వో మరియు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, సీఈ టి.వి. సత్యనారాయణ, ఎస్ఈలు మనోహరం, వెంకటేశ్వరులు, ట్రాన్స్‌పోర్ట్ జీఎం శేషారెడ్డి, డిప్యూటీ ఈవోలు లోకనాథం, సెల్వం, గోవింద రాజన్, సోమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.




# ఇది ప్రజలు కోరుకున్న ప్రజా ప్రభుత్వం : పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**పుట్టపర్తి, జూన్ 4 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** జూన్ 4న ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించి ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రెస్ నోట్ విడుదల చేశారు. ప్రజాస్వామ్యం గెలిచిన రోజు అని, సరిగ్గా సంవత్సరం క్రితం ఇదే రోజున విధ్వంసపాలనపై ప్రజలు గెలిచి ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని గుర్తు చేశారు. ప్రజా తీర్పు కూటమి ప్రభుత్వం బాధ్యతను మరింత పెంచిందిని , చంద్రబాబు పాలనానుభవం, పవనన్న ఆశయానికి నరేంద్ర మోదీ ఆశీస్సులు పుష్కలంగా లభించడంతో ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం ప్రారంభమైందన్నారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఆశీర్వదించిన ఐదు కోట్ల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుందని, ప్రజల ఆకాంక్షలు తప్పక నెరవేరుస్తుందని హామీ ఇచ్చారు. తనని తొలిసారిగా గెలిపించిన పుట్టపర్తి నియోజకవర్గ ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు. తనని వెన్నంటే ఉండి ముందుకు నడిపిస్తున్న మామ మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి రుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేనిదని, వారి మార్గంలో ప్రజాసేవే లక్ష్యంగా నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.



తెలంగాణ

# ప్రభుత్వ వసతి గృహాల్లో ఏసీఎం పిచికారీ దోమల నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి

**తొండూరు, జూన్ 5 (జనస్వరం) :** మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్కరించుకొని, జిల్లా మలేరియా అధికారి మనోరమ ఆదేశాల మేరకు స్థానిక సబ్ యూనిట్ పరిధిలోని ప్రభుత్వ వసతి గృహాల్లో దోమల నివారణ చర్యలు ముమ్మరంగా చేపట్టారు. ఈ క్రమంలో తొండూరులోని డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల బాలికల వసతి గృహంలో ఏసీఎం (ఎంటీ లార్వల్ కెమికల్) పిచికారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ చర్యలను సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో చేపట్టారు. పిచికారీ అనంతరం ఆయన మాట్లాడుతూ "విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రతి ప్రభుత్వ వసతి గృహంలో ఈ పిచికారీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మలేరియా, డెంగ్యూ వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ఇది ఒక కీలక ముందస్తు చర్య," అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సతీష్, సుజాత, హాస్టల్ ప్రిన్సిపాల్ శ్రీమతి ఉషా రాణి, ఆశా కార్యకర్త కుమారి పాల్గొని, వసతి గృహం పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ చర్యలు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు కీలకంగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు.



# పారిశుధ్య కార్మికులకు నిత్యావసర వస్తువులు పంపిణీ

**శేరిలింగంపల్లి, జూన్ 4 (జనస్వరం) :** నియోజకవర్గంలోని గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డిలో గల జీహెచ్ఎంసీ వార్డ్ కార్యాలయంలో అమెజాన్ కంపెనీ సహకారంతో సుమారు 200 మంది పారిశుధ్య కార్మికులకు నిత్యవసర వస్తువులు బుధవారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు నగర పరిశుభ్రత కోసం రోజూ తెల్లవారుజామున నుంచి కష్టపడుతున్నారు. వారివల్లే మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంటున్నాయి. పారిశుధ్య కార్మికులు ఎంతో బాధ్యతగా విధులు నిర్వర్తిస్తున్నారని, ప్రజలకు సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు హనుమంత్ నాయక్, సుమన్, రాజు, శ్రీను, యాదయ్య, గోవింద్ జీహెచ్ఎంసీ సిబ్బంది భారతి, కిస్తయ్య, మల్లేష్, అమెజాన్ సంస్థ ప్రతినిధులు, పారిశుధ్య కార్మికులు, స్థానిక నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# కడశిల్ప గ్రామంలో సూపరిపాలన కార్యక్రమం

**జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బుజ్జిబాబు**

**చింతపల్లి, జూన్ 4 (జనస్వరం) :** గత ఎన్నికల్లో ప్రజలకు అమలు సాధ్యమయ్యే హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ఏడాది కాలంలోనే విశేషమైన అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రజల మద్దతును నిలుపుకుంటోందని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని కడశిల్ప గ్రామంలో మఠం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సూపరిపాలన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ అడవి తల్లి పేరిట గిరిజన ప్రాంతాల్లో రహదారులు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. బడుగు, బలహీన, పీడిత వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. పంచాయతీల ద్వారా మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రత్యేక నిధులతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని ఆయన వివరించారు. గత వైసీపీ పాలనలో పంచాయతీల వ్యవస్థ నిర్వీర్యమై, అభివృద్ధి పథకాలు నిలిచిపోయాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఇప్పటివరకు 85 శాతం అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలయ్యాయని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సాగిన బాలకృష్ణ, మండల కోఆర్డినేటర్ వంతల రాజుబాబు, సీనియర్ నాయకులు చల్లంగి రవి, కొర్ర క్రిష్ణ, కారెగి మత్స్యరాజు, పాంగి సుబ్బారావు, కొర్ర బాలాజీ, శ్యామ్, త్రినాథ్, గిరిజన మోర్చా అధ్యక్షుడు వంటారి చిన్నారావు, గ్రామస్థులు పల్టా సింగి కిషోర్ కుమార్, గోపినాయక చరణ్, గోపినాయక త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



## సుజనాత్మక కృత్యాలపై విద్యార్థులకు అవగాహన

**దెందులూరు, జూన్ 4 (జనస్వరం) :** మండలంలోని పోతునూరు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో బుధవారం బాలలకు పుస్తక పఠనంలో భాగంగా సృజనాత్మక కృత్యాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు నీతి కథలు చెప్పించడం, మంచి, చెడుల గురించి వివరించారు. పెద్దవారి పట్ల ఎలా ప్రవర్తించాలో నేర్పించారు. తదుపరి విద్యార్థులచే క్యారం బోర్డ్స్ ,చదరంగం వంటి ఆటలు ఆడించారు. ఈ కార్యక్రమం గ్రంథపాలకులు గురిందపల్లి రాంబాబు ఆధ్వర్యంలో జరిగాయి. తదుపరి విద్యార్థులకు స్నాక్స్ అందించారు.



## సుపరిపాలనకు ఏడాది పూర్తి

**మైలవరం, జూన్ 4 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** "సుపరిపాలన మొదలైన ఏడాది" సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జనసేన పార్టీ చేపట్టిన ఉత్సవాల్లో భాగంగా, బుధవారం మైలవరం నియోజకవర్గంలోని జనసేన పార్టీ నాయకులు, రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల రామమోహన్ గాంధీ ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో వినూత్న కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీ.కొండూరు మండల పరిధిలోని గ్రామాల్లో కోడి పందేలు, ముగ్గుల పోటీలు నిర్వహించి, వాటిలో విజేతలుగా నిలిచిన మహిళలు, యువకులకు కూటమి నేతల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా ఉపాధ్యక్షులు బొలియశెట్టి శ్రీకాంత్, మండల అధ్యక్షులు ఎర్రబోలు నరసింహారావు, మండల కమిటీ సభ్యులు శ్రీనివాస్, నజీర్, కొండా, గ్రామ అధ్యక్షులు అనిల్, సురేష్, స్వామి, వీరమహిళలు అనిత, రమాదేవి, సుకన్య, కృష్ణవేణి, లక్ష్మి, రాజ్యలక్ష్మి గ్రామ కమిటీ సభ్యులు భాస్కర్, నాగేశ్వరరావు, గణేష్, రామారావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## పాయకరావుపేటలో వైసీపీ ఆధ్వర్యంలో "వెన్నుపోటు దినోత్సవం"

**పాయకరావుపేట, జూన్ 4 (జనస్వరం) :** పట్టణంలో మాజీ సీఎం దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం వైసీపీ శ్రేణులు వెన్నుపోటు దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం కార్యకర్తలు ఎంఆర్ఓ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జోగులు మాట్లాడుతూ.. "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినప్పటికీ ప్రజల కోసం చేసిందేమీ లేదు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం, అనవసరమయిన ధరలు పెంపులు, వనరుల క్షీణత — ఇవన్నీ కూటమి ప్రభుత్వ వెన్నుపోటు చర్యలే," అని విమర్శించారు. "జగన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ప్రతి నెలా ఒక ప్రజాహిత పథకం అమలు చేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం నెలకో షాక్ ఇవ్వడమే తప్ప ప్రజల కోసం ఏ చర్యలూ చేపట్టలేదు," అని పేర్కొన్నారు. ప్రజలు ఈ ప్రభుత్వాన్ని గుర్తించారని, రానున్న రోజుల్లో ఎమ్మెల్యే జగన్ రెడ్డిని మళ్లీ సీఎంగా చూసే రోజు ఎంతో దూరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్, వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, సీనియర్ నాయకులు దనిశెట్టి బాబురావు, జడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసారపు పార్వతి తాతారావు, జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబు, ఉప సర్పంచ్ జగతా శ్రీను, నలుగు మండలాల జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.




## ఎన్కేపల్లి బీటీ రోడ్డు పనులు ప్రారంభం

**బొంరాస్ పేట, జూన్ 4(జనస్వరం) :** వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి బుధవారం మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామంలో రూ.2.95 కోట్ల వ్యయంతో మంజూరైన బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ జయకృష్ణ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింలు గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాంచంద్ర రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్, ప్రవీణ్ కుమార్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజు, మురళి గౌడ్, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## వైసీపీకి ప్రజల్లో మద్దతు లేనిది నిరూపితమైంది : కాల్వ శ్రీనివాసులు

**మంగళగిరి, జూన్ 4 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ప్రజలు తేల్చిన తీర్పును అవమానించేలా వైసీపీ వ్యవహరిస్తోందని, ఓటమిని అంగీకరించకుండా ప్రజలే వెన్నుపోటు పొడిచారని జగన్ వ్యాఖ్యానించడాన్ని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాల్వ శ్రీనివాసులు తీవ్రంగా విమర్శించారు. ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం అభివృద్ధి బాటలో అడుగులు వేస్తుంటే, వైసీపీ మాత్రం అసత్య ఆరోపణలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వం తన ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆయన ఆరోపించారు. "వైసీపీ పాలనలో మద్యం మాఫియా విజృంభించింది. నకిలీ మద్యం వల్ల వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. రేషన్, ఇసుక, భూముల కబ్జా – ఏదీ మినహాయింపుకాలేదు. ప్రజలకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వం ప్రజల మీదే దాడులు చేసింది," అని విమర్శించారు. ఇదే సమయంలో ఎన్డీఏ ప్రభుత్వం కేవలం కొన్ని రోజుల వ్యవధిలోనే కీలక నిర్ణయాలు తీసుకుని ప్రజలకు సంకేతాలు పంపిందని అన్నారు. పెన్షన్లను రూ. 3 వేలు నుండి రూ. 4 వేలకు పెంచడమే కాకుండా 64 లక్షల మందికి పెన్షన్ పంపిణీ చేశారు. పాఠశాలల అభివృద్ధికి 16,347 టీచర్ పోస్టుల నోటిఫికేషన్ విడుదల చేశారు. కరోనాతో చనిపోయిన వారిని గుర్తించి వారి కుటుంబాలకు న్యాయం చేశారు. వ్యవసాయానికి ఊతమిచ్చేలా పలు విధానాలు అమలులోకి తెచ్చారు. పోలవరం ప్రాజెక్టుకు రూ. 12 వేల కోట్ల నిధులు మంజూరు చేయడమే కాకుండా, అమరావతిలో తిరిగి నిర్మాణాలు ప్రారంభం కావడం ఎంతో హర్షణీయం అని చెప్పారు. "రాష్ట్ర పునర్నిర్మాణానికి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ ల నాయకత్వంలో సంకల్పబద్ధంగా పనిచేస్తున్నాం," అని ఆయన చెప్పారు. వ్యవస్థలను బలహీనపరచే విధంగా వైసీపీ పాలన సాగిందని, ఇప్పుడు వాటిని తిరిగి పటిష్ఠంగా చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, గ్రామ సభల నిర్వహణ ద్వారా గ్రామీణ ప్రజల అభిప్రాయాలను గౌరవించడం వంటి చర్యలతో ప్రజాస్వామ్యం బలపడుతోందని తెలిపారు. అంతేగాక, 20 వేల కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని, పంచాయతీలకు రూ.1600 కోట్ల నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించేలా క్లీన్ ఎనర్జీ పాలసీ రూపొందించామని, ఆర్సెల్లార్ మిట్టల్ లాంటి అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయని వివరించారు. వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావడం లేదన్నది వారి ప్రజాప్రతినిధిత్వాన్ని అవమానించడమేనని ఆయన విమర్శించారు. "ఓటమిని జీర్ణించుకోలేని వైసీపీ నేతలు ప్రజల తీర్పును అవమానిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజల సమస్యలపై చర్చించాల్సింది పోయి, దూరంగా ఉండటం అసంభావ్యమన్నారు. "ఇదే తరహా పథకాలు, పారదర్శక పాలన కొనసాగిస్తూ రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు చంద్రబాబు నాయకత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం విశ్వప్రయత్నం చేస్తోంది. గతంలో జరిగిన అవినీతిపై దర్యాప్తులు కొనసాగుతాయి. న్యాయపరంగా చర్యలు తప్పవు. అన్ని వర్గాల సంక్షేమం, భవిష్యత్తు సురక్షితంగా ఉండేలా పాలన సాగుతుంది" అని పేర్కొన్నారు.



## ఘనంగా రాక్షస పాలన అంతమై "ఏడాది" సుపరిపాలన ప్రారంభానికి వేడుకలు

**- నారాయణపురంలో జనసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు**
**- ప్రజల సంబరాల్లో భాగస్వామ్యమైన నేతలు**

**అనంతపురం, జూన్ 4 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలనకు తెరదించి ఎన్డీఏ కూటమి సుపరిపాలన ప్రారంభించిన దినానికి ఏడాది పూర్తైన సందర్భంగా, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని నారాయణపురం పంచాయతీలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. జనసేన పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు, అహుడ చైర్మన్ టి.సి. వరుణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సంక్రాంతిని తలపించేలా రంగురంగుల ముగ్గులతో ప్రాంగణం కళకళలాడింది. మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొనగా, గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు లాయర్ కుంటిమద్ది రెడ్డివారి జయరాం రెడ్డి, నేతలు పెండాల శ్రీలత, ఇతర జనసేన నాయకులు, మహిళా నాయకులు, నగర కమిటీ సభ్యులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ, "రాష్ట్రంలో జరిగిన మార్పు ప్రజల శ్రేయస్సు కోసం. జనసేన పార్టీ నాయకత్వం రాష్ట్ర అభివృద్ధికి, పారదర్శక పాలనకు కట్టుబడి ఉంది," అని చెప్పారు. ప్రజల నుంచి దొరికిన విశేష స్పందనతో, కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.



## కేంద్ర ప్రభుత్వం విధానాలతో నష్టపోతున్న ఆయిల్ పామ్ రైతులు

**- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సమావేశం విమర్శ**

**ఏలూరు, జూన్ 4 (జనస్వరం):** కేంద్ర మోడీ ప్రభుత్వం ముడి పామాయిల్ దిగుమతులపై సుంకాన్ని 20 శాతం నుంచి 10 శాతానికి తగ్గించడంపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల ఆయిల్ పామ్ రైతులు తీవ్రమైన నష్టాలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. బుధవారం ఏలూరులోని అన్నె భవనంలో నిర్వహించిన జిల్లా బేరర్స్ సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగింది. అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు నేతృత్వంలో పలు రైతాంగ సమస్యలపై తీర్మానాలు ఆమోదించబడ్డాయి. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగులో ఆంధ్రప్రదేశ్ దేశంలో అగ్రస్థానంలో ఉందన్నారు. అయితే దిగుమతి సుంకం తగ్గించడం వల్ల గెలల ధర భారీగా పడిపోతుందని, ఒక టన్ను ఆయిల్ పామ్ గెలల ఉత్పత్తికి రూ.22,000 ఖర్చు అవుతుందని, ప్రస్తుతం మార్కెట్లో ధర రూ.20,290 నుంచి రూ.18,850కి పడిపోయిందని పేర్కొన్నారు. ఇది ఇంకా రూ.2,000 తగ్గే అవకాశం ఉందని, ఉత్పత్తి ఖర్చులు కూడ రాకుండా నష్టాల్లో మునిగిపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం తీసుకున్న నిర్ణయంపై పునరాలోచన చేయాలని కోరారు. వర్జీనియా పొగాకు రైతుల పరిస్థితిపై కూడా సమావేశంలో ఆందోళన వ్యక్తమైంది. ప్రస్తుతం కిలోకు సరాసరి రూ.270 మాత్రమే వస్తోందని, ఇది ఉత్పత్తి ఖర్చులకు సరిపోదని, కనీసం కిలోకు రూ.400 ధర ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇంతేకాకుండా, ఇటీవల కేంద్రం 14 రకాల పంటలకు ప్రకటించిన కనీస మద్దతు ధరలు సరిపోవని పేర్కొన్నారు. కేవలం క్వింటాల్ ధాన్యానికి రూ.69 పెంచడమే చేసి చేతులు దులిపేశారని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సూచనల ప్రకారం ఉత్పత్తి ఖర్చుకు 50 శాతం లాభం కలిపి మద్దతు ధరలు నిర్ణయించాలని రైతులు డిమాండ్ చేశారు. రొయ్యల రైతుల సమస్యలపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. అమెరికా ట్రంప్ సుంకాల విధానం వలన రొయ్యల ధరలు పడిపోవడం వల్ల ఆక్వా రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని తెలిపారు. గిట్టుబాటు ధర కల్పించి రొయ్యల సాగును ప్రభుత్వం ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు సిరిబత్తుల సీతారామయ్య, జిల్లా సహాయ కార్యదర్శి కోన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## కూటమి దోపిడీ పాలనను అంతమొందిద్దాం : ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ధ్వజం

**- అక్రమ కేసులకు భయపడేది లేదు**
**- ఏడాది పాలనలో ఒక్క హామీ అమలు కాలేదు**

**పులివెందుల జూన్ 4 (జనస్వరం) :** కూటమి దోపిడీ పాలనను అంతమొందిద్దామని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ధ్వజమెత్తారు. ఏడాది పాలనలో ఏ ఒక్క హామీ అమలు కాకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు. అక్రమ కేసులకు భయపడేది లేదని ఆయన స్పష్టం చేశారు. పట్టణంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతూ వైసీపీ అధిష్టానం ఆదేశాల మేరకు బుధవారం వెన్నుపోటు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని వైసీపీ శ్రేణులు విశేష సంఖ్యలో తరలి రావడంతో పులివెందుల జనసాంద్రమైంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో అవినాష్ రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్యాయాలకు పాల్పడుతోందన్నారు. పచ్చ దొరలందరు పకృతి వనరులను దోచుకుంటున్నారని ఆగ్రహించారు. వైసీపీ నాయకులు కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆయన దుయ్యబట్టారు. గత నెల 28వ తేదీన మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తోపాటు మరి కొంతమంది వైసీపీ నాయకులపై పోలీసులు అక్రమంగా కేసులో ఇరికించారన్నారు. వీళ్లందరినీ స్టేషన్లకు పిలిపించి పొద్దుపొయ్యేదాకా అక్కడే ఉంచుకున్నారన్నారు. రాత్రి సుమారు పది గంటల ప్రాంతంలో శిల్పారామం వద్ద మారణాయుధాలు కలిగి ఉన్నారన్న నెపంతో వాళ్లందరినీ అరెస్టు చేశారన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. వైసీపీ ప్రతి కార్యకర్తకు అండదండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పోలీసులు కూడా పూర్తిగా కూటమి నాయకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఎల్లకాలం ఒకేలా ఉండదని వైసీపీ కూడా మంచి రోజులు వస్తాయని భరోసా కల్పించారు. నాయకులు కార్యకర్తలు అందరూ ధైర్యంగా ఉండాలని సూచించారు.



## ఘనంగా ముగిసిన రాకాసమ్మ దేవి జాతర మహోత్సవం

చింతపల్లి, జూన్ 4 (జనస్వరం) : పర్యాటక ప్రాంతంగా విశేష గుర్తింపు పొందిన లంబసింగి ప్రాంత గ్రామదేవత శ్రీశ్రీశ్రీ రాకాసమ్మ దేవి వార్షిక జాతర మహోత్సవం ఈ నెల 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకునేందుకు తండోపతండాలుగా తరలివచ్చారు. జాతర సందర్భంగా గ్రామమంతటా విద్యుత్ అలంకరణలు, రంగురంగుల తీర్పులతో ఉత్సవ శోభ పులకించగా, మూడు రోజుల పాటు గ్రామం పండుగమయంగా మారింది. జాతర ముగింపు సందర్భంగా నిర్వహించిన బాణాసంచా ప్రదర్శన అనంతర ఆకాశంలో విరిసిన రంగురంగుల అగ్ని పువ్వులు భక్తులకు కనుల పండువగా నిలిచాయి. ఈ సందర్భంగా యువత పెద్ద సంఖ్యలో సెల్ఫీలు తీయడం, వీడియోలు తీసుకోవడం వంటి సందడి దృశ్యాలు దర్శనమిచ్చాయి. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పిస్తూ, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. స్థానికులు పెద్ద ఎత్తున వంటలతో విందులు ఏర్పాటు చేయగా, అన్నదాన కార్యక్రమాలు సైతం నిర్వహించబడ్డాయి. ప్రతి ఏడాది నిర్వహించే ఈ జాతరకు చింతపల్లి పరిసరాలతో పాటు విశాఖపట్నం, హైదరాబాదు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవడం ప్రత్యేకత. గ్రామస్తుల సమిష్టి కృషితో ఈ సంవత్సరం జాతర ఘనంగా విజయవంతమైందని, ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు పూర్తి చేసుకోకుండా సహకరించిన ప్రజలందరికీ ఉత్సవ కమిటీ తరఫున ప్రత్యేకతలు తెలిపారు.





## ఉప్పుమాగులూరులో హనుమాన్ సాయి విఘ్నేశ్వర గ్రానైట్స్ ప్రారంభం

**బాపట్ల, జూన్ 4 (జనస్వరం) :** జిల్లాలోని బల్లికురవ మండలం ఉప్పుమాగులూరు గ్రామంలో హనుమాన్ సాయి విఘ్నేశ్వర గ్రానైట్స్ నూతన ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రానైట్ కటింగ్ మిషన్, పాలిష్ మిషన్‌లను స్విచ్ ఆన్ చేసి పరిశ్రమను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ యజమాని చల్లగుండ్ల శ్రీనివాసరావుకి, వారి భాగస్వాములకు శుభాకాంక్షలు తెలియజేశారు. "ఈ వ్యాపారం స్థానికంగా అభివృద్ధి చెందుతూ, గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని ఆశిస్తున్నాను," అని అన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామస్థుల మధ్య ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపార, సామాజిక రంగ ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సోమేపల్లి వాసు, గొట్టిపాటి సాంబశివరావు, చుండి శ్రీనివాసరావు, నార్నె హనుమంతరావు తదితరులు పాల్గొని, యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కొత్త పరిశ్రమ గ్రామీణ ప్రాంత పారిశ్రామిక అభివృద్ధికి మేలుచేసే సూచికగా మారుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.



Owned by : Sake Naresh (Chairman) - 9642067900, Managed by : Jammu Sai Kalyan (Managing Director) - 7013030690,
REGD NO :APTEL 16144, Mail Id : janaswaramnews@gmail.com Dr.no : 9-35-4A, Illipilli Narasimha Rao Street, Opp KBN College, Kothapeta, Vijayawada - 520001.

# చిలకలూరిపేటలో పుస్తక మహోత్సవాలు ప్రారంభం

**- గ్రంథాలయంలో జానవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నెలపాటు కార్యక్రమాలు**

**చిలకలూరిపేట, జూన్ 4 (జనస్వరం) :** పట్టణంలోని గ్రంథాలయం వద్ద జానవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జూన్ 1 నుంచి 30వ తారీకు వర గ్రంథాలయంలో జానవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నెలపాటు కార్యక్రమాలు కు నిర్వహిస్తున్న పుస్తక మహోత్సవాల కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్. రఫాని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “పుస్తక పఠనం ద్వారా వ్యక్తిత్వ వికాసం కాదు, సమాజంలో సానుకూల మార్పులు సాధ్యమవుతాయి. ఇలాంటి కార్యక్రమాలు యువతలో జ్ఞాన స్ఫూర్తిని పెంచేందుకు చాలా ఉపయోగపడతాయి. ప్రతి ఒక్కరూ చదవడం ఓ అలవాటుగా మార్చుకోవాలి,” అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రా రామారావు, కన్వీనర్ దార్ల బుచ్చిబాబు, ఇన్సెంట్ పాల్, పి.వి.



సుబ్బారావు, లాలు దాదా సాహెబ్ సేవాసమితి అధ్యక్షులు షేక్ కరీముల్లా, డి. వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. వారు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, పుస్తకాల పట్ల ప్రజల్లో ఆసక్తి పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పుస్తక ప్రదర్శన, వివిధ సాహిత్య కార్యక్రమాలు, రచయితల సమావేశాలతో ఈ మహోత్సవం నెల రోజుల పాటు కొనసాగనుంది. స్థానిక విద్యార్థులు, పాఠకులు పెద్ద సంఖ్యలోహాజరైపుస్తకాలుబ్రౌజ్‌చేస్తూఉత్సాహంగాపాల్గొంటున్నారు.

# చిలకలూరిపేటలో వైసీపీ నేతల ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమం

**- మాజీ మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో భారీ ర్యాలీ,**
**- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత**

**చిలకలూరిపేట, జూన్ 4 (జనస్వరం) :** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో మాజీ మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో “వెన్నుపోటు దినం” కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. రాజకీయంగా “వెన్నుపోటు” జరిగి ఏడాది పూర్తైన నేపథ్యంలో చేపట్టిన ఈ ర్యాలీ పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో ఉన్న మాజీ మంత్రి విడదల రజిని నివాసం నుంచి ప్రారంభమై ఎన్‌ఆర్టీ సెంటర్, భాస్కర్ సెంటర్, చౌత్ర, గడియార స్తంభం, విశ్వనాద్ సెంటర్ మీదుగా సాగింది. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని పార్టీ శ్రేణులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా విజ్ఞానం, ప్రజా తీర్పును అవమానించేలా ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో మరణించని పీడ మళ్లీ తిరిగి వచ్చిందని విమర్శించారు. ఒక సంవత్సరంగా రాష్ట్ర ప్రజలు మళ్లీ అన్యాయ పాలనను అనుభవిస్తున్నారని, ఈ రోజును చరిత్రలో “వెన్నుపోటు దినంగా” గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా, పట్టణ శాఖల నాయకులు, మహిళా శ్రేణులు, యువజన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మదనపల్లిలో సంక్రాంతి—దీపావళి కలిపిన సంబరాలు

**- కూటమి విజయానికి ఏడాది**

**మదనపల్లి, జూన్ 4 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** వైసీపీ పీడ విరగడై ఏడాది పూర్తి, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది సందర్భంగా, మదనపల్లిలోని స్థానిక జనసేన నాయకురాలు, రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్ దారం అనిత ఆధ్వర్యంలో జనసేన, టీడీపీ, బీజేపీ మహిళా శ్రేణులు రంగవల్లులు వేసి, టపాకాయలు కాల్చి, దీపాల వెలుగులతో పండుగ వాతావరణం సృష్టించారు. జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, కూటమి ప్రభుత్వ విజయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఇవేలా ఈ కార్యక్రమం చేపట్టారు. వైసీపీ ప్రభుత్వ పీడ ముగిసి, ప్రజల కోసం పనిచేస్తున్న నిజమైన ప్రజాప్రభుత్వం వచ్చిందనే సందేశాన్ని ఈ సంబరాల ద్వారా బలంగా వ్యాప్తి చేశారు. బుధవారం ఉదయం స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద మహిళలు సంప్రదాయబద్ధంగా రంగవల్లులు వేయడం ప్రారంభించగా, ఆ వెంటనే టపాకాయలు కాల్చి, దీపాలు వెలిగించి సంక్రాంతి–దీపావళి కలయికతో సమరసమైన పండుగ నిర్వహించారు. ఈ వేడుకల్లో జనసేన పార్టీ రాష్ట్ర బీసీ కార్యదర్శి మల్లికా, వాణి, స్వరూప, శ్యామలమ్మ, విజయ, నాగరత్న, సుజాత, శిరీష, భవాణి, నాగవేణి, జలజ, విజయలక్ష్మి, పూజ, సుబ్బమ్మ తదితర మహిళా నాయకులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ “ఇది కేవలం ప్రభుత్వానికి పుట్టిన రోజు కాదు... ప్రజలకు తిరిగి వచ్చిన భరోసాకు, స్వచ్ఛ పాలనకు జయంతి” అన్నారు.



# వైసీపీ పీడ విరగడై... సుపరిపాలనకు ఏడాది : ఆళ్లగడ్డలో ఘనంగా వేడుకలు

**ఆళ్లగడ్డ, జూన్ 4 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** రాష్ట్రంలో రాక్షస పాలన ముగిసి, ప్రజలకు భరోసానిచ్చే సుపరిపాలన మొదలై ఏడాది పూర్తయిన సందర్భంగా, డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో జనసేన సమన్వయకర్త మైలేరి మల్లయ్య ఆధ్వర్యంలో భారీ స్థాయిలో సంక్రాంతి–దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన వీరమహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులు వేయడం, ముగ్గుల పోటీలను నిర్వహించడం, అనంతరం పాల్గొన్న మహిళలకు చీరల పంపిణీ చేయడం జరిగింది. ఈ వేడుకలతో గ్రామంలో భోగి, సంక్రాంతి, దీపావళి—అన్ని పండుగ వాతావరణం నెలకొంది. వైసీపీ పాలనలో జరిగిన చీకటి చరిత్రను గుర్తు చేస్తూ, ప్రజలు భయభ్రాంతులకు గురికావడం, కల్తీ మద్యం వల్ల ప్రాణ నష్టం, అక్రమ మైనింగ్, రౌడీయిజం వంటి సమస్యల నుంచి విముక్తి లభించిన రోజుగా ఈ వేడుకను నిర్వహించినట్లు నేతలు వివరించారు. ఈ సందర్భంగా మైలేరి మల్లయ్య మాట్లాడుతూ “ప్రజల స్వేచ్ఛను దోచిన వైసీపీ నాయకులు ఇప్పుడు ఇంటికే పరిమితమయ్యారు. ప్రజలే రాక్షస పాలనకు వెన్నుపోటు పొడిచారు. కూటమి పాలన వల్ల రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోంది.” అని అన్నారు. ఈ వేడుకల్లో నాలుగు రోడ్ల సర్కిల్ వద్ద బాణాసంచా కాల్చడం, దీపాలు వెలిగించడం ద్వారా అంధకార పాలన ముగిసిన రోజుగా ప్రజలు సంబరాలు చేసుకున్నారు.



“డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జీవితం త్యాగానికి ప్రతీకగా నిలుస్తోంది. తన సొంత సౌలభ్యాలను వదిలి పేదల కోసం పనిచేస్తూ గ్రామాలకు రోడ్లు, వెలుగు అందిస్తున్నారన్నది నాయకుల అభిప్రాయం” వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు అమరావతి రాజధాని నిర్మాణం ద్వారా రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో నిలిపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రాచంశెట్టి వెంకటసుబ్బయ్య, దేవా ఆంజనేయులు, బ్రహ్మేంద్ర కుమార్, బావికాడి గుర్రప్ప, నరేంద్ర గౌడ్, జగదీష్, రామయ్య, సుధాకర్, చైతన్య, మధు, శంకర్, సుబ్బారెడ్డి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ జిల్లాలో రైల్వే సమస్యల పరిష్కారానికి ముందడుగు : ఎమ్మెల్యేలతో కలిసి డీఆర్‌ఎంతో ఎంపీ కేశినేని శివనాథ్ సమావేశం

**- సమావేశంలో పాల్గొన్న బొండా ఉమామహేశ్వరరావు, వసంత కృష్ణ ప్రసాద్**
**- విజయవాడ సెంట్రల్, పశ్చిమ, మైలవరం నియోజకవర్గాల ఆర్.యు.బి, ఆర్.ఓ.బి లపై ప్రస్తావన**
**- రైల్వే సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలిచ్చిన డీఆర్‌ఎం**
**- డీఆర్‌ఎంకి రైల్వే సమస్యలపై పోటోలతో సహా లెటర్స్ అందించిన ఎంపీ కేశినేని శివనాథ్**

**విజయవాడ, జూన్ 4 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** సెంట్రల్, పశ్చిమ, మైలవరం నియోజకవర్గాల్లో నెలకొన్న రైల్వే సమస్యలపై ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, వసంత కృష్ణ ప్రసాద్ తో కలిసి డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ.పాటిల్ తో బుధవారం డీఆర్‌ఎం కార్యాలయంలో సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి విచ్చేసిన ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, వసంత కృష్ణ ప్రసాద్ లకు డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ.పాటిల్ సాదర స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్ విజయవాడ సెంట్రల్, పశ్చిమ, మైలవరం నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను నియోజకవర్గాల వారీగా ప్రస్తావించారు. అలాగే తను స్వయంగా ఎమ్మెల్యేలతో వెళ్లి పరిశీలించిన ఆ ప్రాంతంలోని సమస్యలను ప్రస్తావిస్తూ రాసిన లెటర్స్ డి.ఆర్.ఎమ్.నరేంద్ర ఎ.పాటిల్ కి అందజేశారు. ఆ ప్రాంతంలో నెలకొన్న రైల్వే సమస్యలకి సంబంధించి తీసిన పోటోలను లెటర్స్ తో పాటు జత చేసి ఎంపీ కేశినేని శివనాథ్ అందజేశారు. ఈ సమావేశంలో ముందుగా ఎంపీ కేశినేని శివనాథ్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తో కలిసి సెంట్రల్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను వివరించారు. 2009 నుంచి ఇప్పటి వరకు పూర్తికానీ గుణదల ఆర్.వో.బి ఎల్.సి నెంబర్ 7,8, 316కి సంబంధించి ఆర్.యు.బి\ఆర్.ఓ.బికి డీపీఆర్ సిద్దం అయిందని పనులు ప్రారంభం కాలేదని వివరించారు. వాంబే కాలనీ- దేవి నగర్ కట్ట వద్ద ప్రజలు రైల్వే ట్రాక్స్ దాటుతూ ప్రమాదాలకు గురి అవుతన్నారని, ఆ ప్రమాదాలను నివారించేందుకు అండర్ పాస్ లేదా ఆర్.యు.బి\ఆర్.ఓ.బి నిర్మించాలని ప్రతిపాదించారు. ముఖ్యంగా సింగ్ నగర్ రెండో ఆర్.వో.బి గురించి చర్చించారు. ప్రజలు టాఫ్రిక్ కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన పర్మిషన్ల కోసం అవసరమైన సహకారం అందిస్తామని రైల్వే అధికారులకి ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యే ప్రస్తావించిన కొన్ని సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపాలీటీ అధికారులు-రైల్వే అధికారులు కలిసి జాయింట్ సమావేశం నిర్వహించాల్సి వుందని, త్వరలో ఆ సమావేశం ఏర్పాటు చేస్తామని రైల్వే అధికారులు తెలిపారు. అనంతరం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరాతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ పశ్చిమ నియోజకవర్గ రైల్వే సమస్యలను ప్రస్తావించారు. మీసాల రాజేశ్వరరావు వంతెన నుంచి రైల్వే స్టేషన్ వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. అలాగే ఎర్రకట్ట బ్రిడ్జ్ ను వీలైనంత వరకు వెడల్పు చేసి ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలన్నారు. ఇక రైల్వే లైన్స్ కింద డ్రైన్ల క్లీనింగ్ విషయం కూడా ప్రస్తావించారు. రాబోయేది వర్షకాలం కాబట్టి ముందుగానే జాగ్రత్త పడాలన్నారు. ఇక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ మైలవరం నియోజకవర్గంలో నెలకొన్న రైల్వే సమస్యలను ప్రస్తావించారు. విజయవాడ రైల్వే స్టేషన్ లో రద్దీ తగ్గించి ప్రయాణికులను వేగంగా గమ్యస్థానాలకు చేర్చేలా రైల్వేశాఖ రాయనపాడు స్టేషన్ శాటిలైట్ స్టేషన్ గా అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద మోడల్ గా తీర్చిదిద్దినందకు ఎంపీ కేశినేని శివనాథ్ అభినందనలు తెలిపారు. ఆ తర్వాత కొండపల్లి రైల్వే స్టేషన్ లో ప్రయాణీకులు పూర్తిస్థాయిలో ఫ్లాట్ పామ్ లేకపోవటం వల్ల పడుతున్న ఇబ్బందులు వివరించారు. పూర్తి స్థాయిలో కొండపల్లి రైల్వే స్టేషన్ ఆధునీకరించాల్సిన పరిస్థితులను తెలియజేశారు. అమృత భారత్ స్టేషన్ పథకం కింద కొండపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించాలన్నారు. అలాగే కొండపల్లి వద్ద లెవల్ క్రాసింగ్ (ఎల్.సి) 140 వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ), ఇబ్రహీంపట్నం మండలంలోని ఈలప్రోలు వద్ద ఎల్.సి 147,148 వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీటితో పాటు కొండపల్లి ఎస్టి కాలనీ వద్ద రైల్వే లైన్ కింద డ్రైనేజీ లో పూడికను తొలగించక పోవడం వల్ల చిన్నపాటి వర్షం వస్తే ప్రజలు పడుతున్న ఇబ్బందులు వివరించారు. అదే విధంగా



గొల్లపూడి ఎల్.సి. నెంబర్ 150 ఆర్వోబి వద్ద డ్రైనేజీ నిర్మాణ పనుల్లో కొన్ని సాంకేతిక కారణాలవల్ల డ్రైనేజీ నీరు పారుదల సౌకర్యం సక్రమంగా లేదన్న సమస్యను కూడా రైల్వే అధికారుల దృష్టి తీసుకువెళ్లారు. ఈ సమస్యలపై డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ.పాటిల్ సంబంధిత రైల్వే అధికారులతో మాట్లాడారు. వీలైనంత త్వరగా ఆ పనులు పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో అడిషన్ డి.ఆర్.ఎమ్. పి.ఈ.ఎడ్విన్, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ గతిశక్తి మనోహర్ రెడ్డి, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆర్.ఎల్. డి.ఎ. విష్ణువర్ధన్ రావు, సీనియర్ డి.ఈ.ఎన్. వరుణ్ బాబు, సీనియర్ డి.సి. ఎం. వి.రాంబాబు, సీనియర్ డి.వో.ఎమ్. డి.నరేంద్ర వర్మ పాల్గొన్నారు.

# అరట్లకోటలో “రాష్ట్రంలో సుపరిపాలన మొదలై ఏడాది” సంబరాలు

**పాయకరావుపేట, జూన్ 4 (జనస్వరం) :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై చేస్తూన్న సుపరిపాలనకు ఏడాదైన సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ గెడ్డం బుజ్జి ఆదేశాలు మేరకు అరట్లకోట జనసేన పార్టీ ఆద్వర్యంలో వేకువజామున నుండి వీధి వీధిని మహిళలు వాకిళ్లలో ముగ్గులు వేసి రంగవల్లులతో అలంకరించారు. అనంతరం జనసేన నాయకులు స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ కేంద్రంలో.. రాష్ట్రంలో ప్రజలకు సుపరిపాలన అందిస్తూనందకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన అధ్యక్షులు తుమ్మల గణేష్, వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.



# వాహనాలు రహదారులపై అడ్డంగా నిలిపితే కఠిన చర్యలు తప్పవు

**- చింతపల్లి ఎస్సై వెంకటరమణ**

**చింతపల్లి, జూన్ 4 (జనస్వరం) :** చింతపల్లి ప్రధాన రహదారిపై వాహనాలు నిలిపితే లేదా చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటు చేసి రాకపోకలకు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని చింతపల్లి ఎస్సై ఎం. వెంకటరమణ హెచ్చరించారు. సబ్ డివిజన్ ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా ఆదేశాల మేరకు, సీఐ ఎం. వినోద్ బాబు పర్యవేక్షణలో బుధవారం జరిగిన ప్రత్యేక తనిఖీల్లో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి హనుమాన్ జంక్షన్ కూడలి వరకు ట్రాఫిక్ పరిస్థితిని పరిశీలించినట్టు ఎస్సై తెలిపారు. సంతబయలు, పాత బస్టాండు కూడలి, రంగ సెంటర్, మండల పరిషత్ కార్యాలయం వద్ద రహదారిపై వాహనాలు పార్క్ చేయడం, వ్యాపార దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందన్నారు. ముఖ్యంగా ప్రతి ఆదివారం, బుధవారం రోజుల్లో రహదారులపై వాహనాలు నిలిపితే, దానికి సంబంధిత వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఏపీఎస్పీ పోలీసు సిబ్బంది, సీఆర్పీఎఫ్ బలగాలతో కలిసి ఎస్సై వెంకటరమణ మార్గదర్శకంగా ముందంజ వేశారు. ప్రజలు సహకరిస్తే మాత్రమే ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని ఆకాంక్షించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఏపీఎస్పీ, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఏపీఎస్పీ, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



# కుక్కలు బాబోయ్ కుక్కలు

**పులివెందుల, జూన్ 4 (జనస్వరం) :** నియోజకవర్గపరిధిలోపట్నంమొదలుకొనిపల్లెటూర్లవరకుకుక్కల బెడద ఎక్కువైంది. ఎక్కడపడితే అక్కడ గుంపులు గుంపులుగా సంచరిస్తూ సగటు మనిషిపై దాడులకు తెగబడుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మాంసపు దుకాణాల వద్ద కుక్కలు తిష్ట వేసుకొని అక్కడ పడే మాంసమ్ ముక్కలకు అలవాటు పడ్డాయి. మాంసపు దుకాణాల నిర్వహణ లేని సమయంలో రక్త మాంసాలకుఅలవాటు పడి ఆకలి కొన్న కుక్కలు మనుషులపై దాడి చేసి కండలు ఊడొచ్చే విధంగా కొరికిపడేస్తున్నాయి. కుక్కలు ఈ విధంగా ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం ఈ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారు. ఇందుకు ప్రధాన కారణం జీవహింస నివారణ చట్టం పంచాయతీ శాఖ అధికారులను బెదరగొడుతూ ఉంది. జీవహింస నివారణ (శునకాల జనన నియంత్రణ) చట్టం 2023 ప్రకారం వీధి సునకాలను చంపడం హింసించడం నేరం. కాగా జీవో హింసను అరికట్టాలని సహాయప డాలని జంతువులకు హింస కలగకుండా చూడాలని చట్టంలో రూపొందించారు. ఈ కారణంగా గ్రామాలలో కుక్కల బెడదను నివారించేందుకు పంచాయతీ అధికారులు సైతం బెదిరిపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కుక్కల బెడద నివారణ పై నియంత్రణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# కూటమి పాలనలో.. విధ్వంసం నుంచి వికాసం దిశగా ఆంధ్రప్రదేశ్

**గుంటూరు, జూన్ 4 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** గత సంవత్సరం జరిగిన ఎన్నికల్లో వైసీపీ విధ్వంసకర పాలన నుంచి విముక్తి పొందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూటమి ప్రభుత్వ పాలనలో విధ్వంసం నుంచి వికాసం దిశగా పయనిస్తుందని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా జనసేనాని పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపుమేరకు శ్రీనివాసరావుతోటలో విజయాలకు ప్రతీకగా దీపాలు వెలిగించి బాణాసంచా కాల్చుతూ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాజు గ్లాస్ దిమ్మెను దీపాలతో అలంకరించారు. ఆళ్ళ హరి మాట్లాడుతూ పురాణాల్లో దేవతలని హింసించిన నరకాసురుడుకి ప్రజా కంఠక పాలనతో రాష్ట్ర ప్రజల్ని పీక్కుతిన్న వైసీపీ అధినేత జగనాసురుడికి తేడా లేదన్నారు. నరకాసురుడిని శ్రీకృష్ణుడు వదిస్తే , జగనాసురుడిని ప్రజలు తమ ఓటుతో రాజకీయ సమాధి చేశారన్నారు. వైసీపీ పాలనలో బిక్కుబిక్కుమంటూ కాలం గడిపిన ప్రజలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఊపిరి పీల్చుకొన్నారన్నారు. కూటమి సుపరిపాలనలో ప్రజలు ప్రశాంతంగా సేద తీరుతున్నారని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల బాధ్యతాయుతమైన పాలనతో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధిపదంలో ముందుకు సాగుతుందన్నారు. మరోవైపు దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలను సైతం అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఆళ్ళ హరి అన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో కూటమి నేతలు మెహబుబ్ బాషా, సుబ్బారావు, భవాని, ధరణి, కోలా అంజి, బాలకృష్ణ, బాలు, బుజ్జి, చిరంజీవి, మిరియాల వెంకట్, శేషు, లుంగీ నరసింహారావు, చింతకాయల సాయి, మస్తాన్ వలి, తేజ, నందూరి స్వామి తదితరులు పాల్గొన్నారు.



జనస్వరం

## పార్టీ పిలుపుమేరకు దీపావళి పండుగ

- టపాసులు కాల్చి సంబరాలు నిర్వహణ
- నరకాసురిని వద పేరుతో జగన్ దిష్టి బొమ్మ ఊరేగింపు
- జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్

**విజయవాడ జూన్ 4 (జనస్వరం) :** రాష్ట్రానికి పట్టిన పీడ విరగడై నేటికీ సంవత్సరమైందని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్ అన్నారు. విజయవాడ కాలేశ్వర మార్కెట్ సెంటర్ వద్ద జనసేన పార్టీ అధిష్టానం పిలుపుమేరకు జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్ నేతృత్వంలో కూటమి నాయకులు భారీగా టపకాయలు కాల్చి సంబరాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. మాజీ సీఎం జగన్ రెడ్డి పాలనలో ప్రజలతో పాటు అధికారులు కూడా చాలా ఇబ్బందులు పట్టారనన్నారు. జగన్ హయంలో పనిచేసిన అధికారులు కొంతమంది అవినీతికి పాల్పడి నేడు జైలులో తమ యొక్క జీవితాన్ని గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కొంపల్లి అరుణ్ కుమార్, కొండవీటి ఈశ్వరరావు, సమతం సత్తిబాబు, మంటాడ విజయ్ కుమార్, రాజా నాయుడు, గన్ను శంకర్, ముద్రబోయిన దేవిక, తమ్మిన లీల గంగాధర్, గంజి పవన్ కుమార్, ఏలూరు సాయి శరత్, మారేపల్లి శ్యామ్, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, గుండాల నాని, వాసు తదితరులు కూటమి నాయకులు పాల్గొన్నారు.



## విధ్వంస పాలనకు తెర.. అభివృద్ధి దిశగా తొలి అడుగు

- చిలకలూరిపేటలో విజయోత్సవ దినం ఘనంగా నిర్వహణ
- టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసిన నేతలు
- 2024 జూన్ 4ను చరిత్రాత్మకంగా భావిస్తున్న శ్రేణులు

**చిలకలూరిపేట, జూన్ 4 (జనస్వరం) :** 2019 నుండి 2024 వరకు రాష్ట్ర ప్రజలపై కొనసాగిన విధ్వంసకర పాలనకు ప్రజాస్వామ్య రీతిలో ముగింపు పలికి, అభివృద్ధి దిశగా పయనించే ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన చారిత్రక రోజుగా జూన్ 4వ తేదీని విజయోత్సవ దినంగా టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విజయోత్సవ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ కరిముల్లా, పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్ లు సంయుక్తంగా విజయోత్సవానికి గుర్తుగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు మిఠాయిలు పంచుతూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జూన్ 4, 2024 తేదీన ప్రజలు తీసుకున్న చారిత్రక నిర్ణయం రాష్ట్ర రాజకీయ చరిత్రలో చెరగని ముద్ర వేసిందని వారు పేర్కొన్నారు. "ఈ రోజు నుంచే రాష్ట్ర అభివృద్ధి, పారదర్శక పాలనకు నాంది పలికిన రోజు. దీన్ని విజయోత్సవ దినంగా ప్రతి సంవత్సరం జరుపుకుంటూ ప్రజల కోసం సమర్థవంతంగా పని చేస్తాం" అని నేతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.



## వెన్నుపోటు కాదు.. అది గొడ్డలి పోటు దినం

- బీటెక్ రవి సతీమణి లతా రెడ్డి

**పులివెందుల, జూన్ 4 (జనస్వరం) :** వైసీపీ నిర్వహించిన వెన్నుపోటు నిరసన కాదని అది గొడ్డలి పోటని నామకరణం చేస్తే సరిపోతుందని టీడీపీ ఇన్చార్జ్ బీటెక్ రవి సతీమణి లతారెడ్డి ఎద్దేవా చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో కూటమి విజయానికి ఏడాది పూర్తయిన సందర్భంగా సుపరిపాలన వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వెన్నుపోటు గురించి మీరు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రానికి పట్టిన పీడ విరగడై ఏడాది అయిందని తెలిపారు. కేంద్రంలో పీఎం నరేంద్రమోదీ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నియోజకవర్గంలో టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవిలు నిరంతరం కష్టపడుతూ రాష్ట్రాన్ని, నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పథంలో నడిపించడం చూసి జగన్మోహన్ రెడ్డి ఓర్వలేకపోతున్నాడన్నారు. తల్లిని, చెల్లిని పార్టీ నుంచి గెంటేసి వెన్నుపోటు పొడిచిన జగన్ రెడ్డి వెన్నుపోటు గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు తూగుట్ల సిద్దారెడ్డి, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాష, నల్లగారి భాస్కర్ రెడ్డి, కాంబల్లి గంగాధర్ రెడ్డి, మేకల విజయ భాస్కర్ రెడ్డి తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్

**దెందులూరు, జూన్ 4 (జనస్వరం) :** దివ్యాంగులతో పాటు 65 ఏళ్లు పైబడిన వృద్ధులు రేషన్ దుకాణాల వద్దకు రావలసిన అవసరం లేకుండా సేవా భావంతో డీలర్లు రేషన్ పంపిణీ సక్రమంగా చేస్తున్నారు. బుధవారం ఉండ్రాజవరం గ్రామంలో షాప్ నెంబర్ 11 డీలర్ బి శెట్టి, వెంకట సత్యనారాయణ వృద్ధులు, వికలాంగులు వారి ఇంటి వద్దకు వెళ్లి రేషన్ సరుకులు అందించారు.



# మసులా బీచ్ ఫెస్టివల్ కు సర్వం సిద్ధం

* నేటి నుండి బీచ్ ఫెస్టివల్ ప్రారంభం
* నాలుగు రోజుల పాటు జరగనున్న ఫెస్టివల్
* తొలి రోజు ప్రారంభం కానున్న జాతీయ స్థాయి క్రీడా పోటీలు
* 2వ రోజు నుండి స్టేజ్ ఈవెంట్స్ ప్రారంభం
* ఫెస్టివల్ నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు
* నెల రోజులుగా శ్రమిస్తున్న చేసిన అధికార యంత్రాంగం
* ప్రత్యేక ఆకర్షణగా గేట్ వే ఆఫ్ అమరావతి ఐకాన్

**మచిలీపట్నం, జూన్ 4 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** 'ఇది మన ఊరు.. మన పండుగ' నినాదంతో ఈ నెల 6 నుండి 8వ తేదీ వరకు మచిలీపట్నం మంగినపూడి సముద్ర తీరం వద్ద నిర్వహించనున్న మసులా బీచ్ ఫెస్ట్ - 2025కు సర్వం సిద్ధం చేశారు. పర్యాటక శాఖ, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ, కృష్ణాజిల్లా అధికార యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే బీచ్ ఫెస్టివల్ కు సంబంధించి విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేశారు. బీచ్ ఫెస్టివల్ లో భాగంగా ఒక రోజు ముందుగా 5వ తేదీ నుండి 8వ తేదీ వరకు నేషనల్ వాటర్ స్పోర్ట్స్, బీచ్ వాలీబాల్, బీచ్ కబడ్డీ పోటీలను నిర్వహించనున్నారు. దక్షిణ భారత దేశంలోనే అతి పెద్ద ఈవెంట్గా మసులా బీచ్ ఫెస్టివల్ ఉండనుంది. ఎమ్యూజ్ మెంట్, ఎంటర్ టైన్మెంట్, అడ్వెంచర్ స్పోర్ట్స్ కూడా నిర్వహిస్తున్నారు. హెలీ రైడ్, పారా గ్లైడింగ్, స్పీడ్ బోట్, జెట్ సీ, బంగీ లాంటి క్రీడలను కూడా ఏర్పాటు చేశారు. 5వ తేదీ ఉదయం 9 గంటలకు క్రీడాకారుల ఆధ్వర్యంలో 60 అడుగుల ఎత్తులో అమరావతి అసెంబ్లీ నమూనాతో ఏర్పాటు చేసిన గేట్ వే ఆఫ్ అమరావతిని ఆవిష్కరించనున్నారు. 100 అడుగుల జాతీయ జెండా ఆవిష్కరణతో వాటర్ స్పోర్ట్స్ ను ప్రారంభించనున్నారు. 6వ తేదీ సాయంత్రం నుండి తెలుగు సినీ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, తెలుగు వారి రుచులు, ప్రత్యేకంగా బందరు రుచులు, ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి తెలియజేసే లక్ష్యంతో సుమారు 100కి పైగా ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే భారతదేశంలో ప్రత్యేకమైన రుచులతో కూడిన ఆహార పదార్థాలతో ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు, ఫెస్టివల్ కు వచ్చే పర్యాటకులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా జిల్లా కలెక్టర్ నేతృత్వంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ నేతృత్వంలో పర్యాటకుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా వన్ వే ట్రాఫిక్ ను పోలీసులు ఏర్పాటు చేస్తున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మసులా బీచ్ ఫెస్ట్ కు సంబంధించి ప్రతి కార్యక్రమాన్ని కూడా లైవ్ టెలికాస్ట్ చేయనున్నారు. సముద్ర స్నానాలకు వెళ్లే వారికి మెరైన్ అధికారులు సహకారం అందిస్తున్నారు. మసులా బీచ్ ఫెస్టివల్ మంత్రి కొల్లు. రవీంద్ర ఆధ్వర్యంలో అంగ రంగ వైభవంగా నిర్వహించనున్నారు. రవీంద్ర ఆధ్వర్యంలో అంగ రంగ వైభవంగా నిర్వహించనున్నారు.

**12వ బీచ్ కబడ్డీ ఛాంపియన్ షిప్ :**

12వ జాతీయ స్థాయి బీచ్ కబడ్డీ ఛాంపియన్ షిప్ జరుగనుంది. ఈ ఛాంపియన్ షిప్ లో 24 రాష్ట్రాల నుండి పురుషుల, 21 రాష్ట్రాల నుండి మహిళల జట్లు పాల్గొనున్నాయి. సుమారు 600 మంది క్రీడాకారులు, నిర్వహకులు ఈ టోర్నిలో ప్రాతినిధ్యం వహించనున్నారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో టోర్ని జరుగనుంది.

**రాష్ట్రంలో తొలిసారిగా సీ కయాకింగ్ స్పోర్ట్స్ :**

3వ జాతీయస్థాయి కయాకింగ్ పోటీలను రాష్ట్రంలోనే తొలిసారిగా మచిలీపట్నం మంగినపూడి బీచ్ లో నిర్వహించనున్నారు. సుమారు 16 రాష్ట్రాల నుండి సుమారు 600 మంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారుల, నిర్వాహకులు పోటీల్లో పాల్గొనున్నారు.

**ఆహ్వానపు బీచ్ వాలీబాల్ పోటీలు :**

మసులా బీచ్ ఫెస్ట్ - 2025లో భాగంగా ఆహ్వానపు బీచ్ వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో 8 పురుషుల, 4 మహిళల జట్లు పాల్గొననున్నాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్దతిలో పోటీలు జరుగనున్నాయి. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, కడప జిల్లాల నుండి పురుషుల జట్లు, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల నుండి మహిళల జట్లు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్ లో పాల్గొనే క్రీడాకారులకు, నిర్వహకులకు భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

## జర్నలిస్టుల సంక్షేమ పథకాలను తక్షణమే పునరుద్ధరించాలి

- ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్

**విజయవాడ, జూన్ 4 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** గత ప్రభుత్వాల హయాంలో ఉన్న జర్నలిస్టు సంక్షేమ పథకాలను తక్షణమే పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీ రామ్ యాదవ్ కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీనియర్ జర్నలిస్టు, ఏ.పీ. ఎం.పీ.ఏ. రాష్ట్ర ఉపాధ్యక్షులు యేమినేని వెంకటరమణ జన్మదిన సందర్భంగా చిట్టి నగర్ లోని శ్రీ గౌతమి విద్యాసంస్థల ప్రాంగణంలో నగర అధ్యక్షులు తాళ్లూరి అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీ రామ్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం అనేక జీ.ఓ.లను విడుదల చేసే ప్రభుత్వాలు మీడియా అక్రిడిటేషన్ జీ.ఓ.విషయంలో తీవ్ర ఆలస్యం చేస్తూ ఉండటం వల్ల వర్కింగ్ జర్నలిస్టులు అభద్రతా భావానికి గురి అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వర్కింగ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రాని మీడియా జర్నలిస్టులు అందరికీ సులభతరంగా అక్రిడేషన్ మంజూరు అయ్యేవిధంగా తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గత ప్రభుత్వ హయాంలో ఉన్న జర్నలిస్టు యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీ, జర్నలిస్టు హెల్త్ కార్డు, సంక్షేమ నిధి తక్షణమే పునరుద్ధరించాలని శ్రీ రామ్ యాదవ్ కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాలలో 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న జర్నలిస్టులకు పెన్షన్స్ సౌకర్యం అమలు చేస్తున్నారన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ లో 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వర్కింగ్ మీడియా ప్రతినిధులకు 10,000 పెన్షన్ సౌకర్యాన్ని కలిగించాలని కోరారు. జర్నలిస్టుల మీద, పత్రిక కార్యాలయాల మీద దాడులు జరుగుతున్న నేపథ్యంలో తక్షణమే మీడియా దాడుల నిరోధక కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ నగర ప్రధాన కార్యదర్శి "అంతరాత్మ" గుర్రం శ్రీనివాస రావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో అంతిమ తీర్పు వల్లూరు ప్రసాద్, సీనియర్ జర్నలిస్ట్ తిరుమల శెట్టి నాగేశ్వరావు, ఆంధ్ర ప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ నగర నాయకులు నాగోతి శ్రీనివాసరావు (ఎన్.ఎస్.అర్.), ఆర్ కోటేశ్వరరావు, సుంకర



సందీప్, యరజర్ల నాగరాజు, హరి ప్రసాద్ రెడ్డి పోతిన బాలాజీ, లంక చరణ్, వాండ్రసి బంగారురాజు, సాయి, ఆనంద్, పొట్నూరి శివ,చిలి వేలు సురేంద్ర బాబు, నాగోతి శ్రీనివాసరావు, వై వి ఎస్ భరత్ రావు,కొల్లి దుర్గారావు, మౌళి, పిల్ల ఆనంద్, టి. పనింద్ర తదితరులు పాల్గొని "యేమినేని" వెంకటరమణను ఘనంగా సత్కరించారు.

## కలెక్టర్ ఆధ్వర్యంలో రేషన్ షాపు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

**బొంరాస్ పేట, జూన్ 4 (జనస్వరం) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు రేషన్ కార్డు కలిగివున్న వారికి మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా సాగేలా అధికారులు చొరవ చూపాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ అన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, జిల్లా సివిల్ సప్లై అధికారి మోహన్ బాబుతో కలిసి రేషన్ షాపును తనిఖీ చేశారు. అనంతరం ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు



లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఆయన వెంట సూపరింటెండెంట్ వెంకన్ గౌడ్,మండల పంచాయతీ అధికారి రవి



నాయక్, పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య,కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ఉన్నారు.

## సుపరిపాలనకు సంవత్సరం పూర్తి

- రాజంపేటలో పండుగ వాతావరణం
- జనసేన పార్టీ కార్యాలయంలో బాణసంచా, విద్యుత్ దీపాలతో వేడుక

**రాజంపేట, జూన్ 4 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు ఏడాది పూర్తైన సందర్భంగా జనసేన పార్టీ అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశానుసారం, రాజంపేట పార్లమెంటు జనసేన పార్టీ ఇంచార్జ్ యల్లటూరు శ్రీనివాస రాజు సూచన మేరకు "సుపరిపాలన మొదలై ఏడాది" అనే కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయం యల్లటూరు భవన్ వద్ద విద్యుత్ దీపాల అలంకరణతో కార్యాలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. అనంతరం బాణసంచా కాల్చి, సంక్రాంతి – దీపావళి కలబోసినట్లుగా జనసేన శ్రేణులు ఈ వేడుకను జరుపుకున్నాయి. ఈ సందర్భంగా యల్లటూరు శివరామరాజు మాట్లాడుతూ – "గత పాలనలో గాడితప్పిన రాష్ట్రానికి విముక్తి లభించి, నూతన అభివృద్ధికి నాంది పలికిన ఈ రోజు రాష్ట్రానికి



మహర్దశకు ప్రతీక. జనసేనాని పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, ఇంచార్జ్ శ్రీనివాస రాజు నాయకత్వంలో ఈ పండుగలా వేడుక జరుపుకోవడం గర్వకారణం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో మామిళ్ళ రవి, పెడకాల సుధాకర్, నారబోయిన ప్రసాద్, తిప్పాయపల్లె ప్రశాంత్, తిప్పన రమేష్ బాబు, తిప్పన హరి, శంకర్ రాజు, తోట సురేష్, సారా రాజేష్, యెద్దల నరేష్, నాగేంద్ర, మధు, హైదర్ అలీ, శ్రీను, లక్ష్మీనరసయ్య, వీరయ్య, లక్ష్మీపతి రాజు, అక్కినికుంట్ల శివకుమార్, రామిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## జనసేన మహిళా కార్యాలయంలో టపాసులతో

**అనంతపురం, జూన్ 4 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** రాష్ట్రానికి పట్టిన వైసీపీ పీడ విరగడి, ప్రజల మెప్పుతో ఏర్పడిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఘనతతో,



"సుపరిపాలన ప్రారంభమైన ఒక సంవత్సరం" అయిన సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు నిర్వహించారు. ఈ క్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు, జనసేన రాయలసీమ రీజనల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెంద్యాల శ్రీలత నేతృత్వంలో జనసేన మహిళా కార్యాలయం, అనంతపురం ఆవరణంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీర మహిళలు, నాయకులు, కార్యకర్తలు రాష్ట్రానికి విముక్తి లభించిన రోజును దీపావళి పండుగను తలపించేలా దీపాలు వెలిగించి, టపాసులు కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. పీడ నుండి ప్రజలను విముక్తం చేసిన రోజు ఇది అనే సందేశాన్ని ఈ వేడుకల్లో పలికించారు. ఈ కార్యక్రమంలో జనసేన మహిళా విభాగం సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## అఖండ విజయానికి ఏడాది పూర్తి : కోవూరు ఎమ్మెల్యేగా ప్రశాంతిరెడ్డి

**నెల్లూరు, జూన్ 4 (జనస్వరం) :** రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా టీడీపీ, బీజేపీ, జనసేనల కూటమి 2024లో ప్రభంజనం సృష్టించి 164 సీట్లు సాధించిందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులుగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యేగా ప్రశాంతిరెడ్డి భారీ విజయం నమోదు చేయగా.. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం టీడీపీ నాయకులు బెజవాడ వంశీరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు సంబరాలు చేశారు. ఈ సందర్భంగా విపిఆర్ నివాసంలో కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీ వేమిరెడ్డి దంపతులు కేకు కట్ చేసి నాయకులకు పంచారు. అలాగే టీడీపీ నాయకులు డేవిడ్ జాన్ ఆధ్వర్యంలో ఆయన అనుచరులతో ప్రత్యేకంగా తయారు చేయించిన 25 కేజీల కేకును ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతమ్మ కట్ చేసి నాయకులకు పంచారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు సారధ్యంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని చెప్పారు, రాష్ట్రం సుభిక్షంగా ఉందని వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బుచ్చిరెడ్డిపాలెం అర్బన్, రూరల్ మండల అధ్యక్షులు గుత్తా శ్రీనివాసరావు, బెజవాడ జగదీష్ లతో పాటు కోవూరు నియోజకవర్గానికి చెందిన అన్ని మండలాల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బెజవాడ జగదీష్ లతో పాటు కోవూరు నియోజకవర్గానికి చెందిన అన్ని మండలాల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రజలకు హామీలిచ్చి వాటిని గాలికి వదిలేసిన చంద్రబాబు

**- చేసిన మోసాలు, ఆరాచకాలు, అన్యాయాలపై "వెన్నుపోటు దినోత్సవాన్ని" నిర్వహించిన వైసీపీ శ్రేణులు**



**దెందులూరు, జూన్ 4 (జనస్వరం) :** కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు సూపర్ - 6 పథకాలు ఇస్తానని ప్రజల్ని నమ్మించి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న ఒక్క పథకం కూడా అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిన కూటమి పాలనను నిలదీస్తూ పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ పిలుపుమేరకు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఆదేశాల మేరకు దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం వైసీపీ శ్రేణులు వెన్నుపోటు దినోత్సవం నిర్వహించారు. అనంతరం కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి పెదపాడు మండల తహసిల్దార్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కామిరెడ్డి నాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినప్పటికీ ప్రజల కోసం చేసిందేమీ లేదు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం అనవసరమైన ధరలో పెంపులు వనరుల క్షీణత ఇవన్నీ కూటమి ప్రభుత్వ వెన్నుపోటు చర్యలే అని విమర్శించారు. వైఎస్ జగన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ప్రతినెల ఒక ప్రజాహిత పథకం అమలు చేసే వారని, కానీ ప్రస్తుత ప్రభుత్వం నెలకో షాక్ ఇవ్వడమే తప్ప ప్రజల కోసం ఏ చర్యలు చేపట్టలేదని పేర్కొన్నారు. ప్రజలు ఈ ప్రభుత్వాన్ని గుర్తించారని రానున్న రోజుల్లో మళ్లీ జగన్ రెడ్డిని సీఎంగా చూసే రోజు ఎంతో దూరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు కామిరెడ్డి నాని, జడ్పిటిసి నిట్టా లీలా నవకాంతం, అప్పన్న ప్రసాద్, తేరా ఆనంద్, వేమూరి జితేంద్ర, బత్తుల రత్నకుమారి, పళ్లెం ప్రసాద్, ముంగర సంజీవ్ కుమార్, కట్టా ఏసుబాబు, నియోజకవర్గ వైసీపీ కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఏలూరు డీసీసీబీ చైర్మన్ గా గన్ని వీరాంజనేయులు ప్రమాణ స్వీకారం

**- గన్ని వీరాంజనేయులుని అభినందించిన జిల్లా పరిషత్ చైర్ పర్సన్, ఎమ్మెల్యేలు, ప్రముఖులు**



**ఏలూరు, జూన్, 4 (జనస్వరం) :** జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ గా గన్ని వీరాంజనేయులు ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక డీసీసీబీ ఆవరణలో బుధవారం సాయంత్రం బ్యాంకు సీఈఓ పి.సింహాచలం గన్ని వీరాంజనేయులు చేత చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేయించారు. గన్ని వీరాంజనేయులును జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య , సొంగా రోషన్ కుమార్, పత్సమట్ల ధర్మరాజు, ఆరిమిల్లి రాధాకృష్ణ, పితాని సత్యనారాయణ, మద్దిపాటి వెంకటరాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కార్పొరేషన్ చైర్మన్ మంతెన రామరాజు, ఏలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, మాజీ మంత్రి మరడాని రంగారావు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, పలువురు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రతీ రైతుకు మేలు జరిగేలా రేయింబవళ్లు కృషిచేస్తానని చెప్పారు. ఏలూరు డీసీసీబీ చైర్మన్ గా ఏలూరు జిల్లాలోని రైతాంగానికి, అదేవిధంగా ఆప్కాబ్ చైర్మన్ గా రాష్ట్రంలోని రైతుల సంక్షేమానికి కృషి చేస్తారన్నారు. తన సమర్థతను గుర్తించి ఏలూరు డిసిసిబి చైర్మన్ గా అదేవిధంగా ఆప్కాబ్ చైర్మన్ గా అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు కి, కూటమి నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేసారు. అధికారుల సహకారంతో ఏలూరు డీసీసీబీని లాభాల బాటలోకి తీసుకువస్తానని గన్ని వీరాంజనేయులు చెప్పారు. జిల్లా సహకార శాఖాధికారి ఏ.శ్రీనివాస్, డీసీసీబీ బ్యాంకు జనరల్ మేనేజర్ మాధురి, ఏ జీఎం శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనోద్ధారకులు వెన్నెలకంటి రాఘవయ్య

**మేయర్ స్రవంతి జయవర్ధన్ ఘననివాళి**



**నెల్లూరు, జూన్ 4 (జనస్వరం) :** గిరిజనులు అభ్యునతి కోసం నిరంతరం శ్రమించిన మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధులు వెన్నెలకంటి రాఘవయ్య వారి జయంతి సందర్భంగా సుబేదార్ పేటలో ఉన్నటువంటి రాఘవయ్య భవన్ లోని వారి విగ్రహానికి మేయర్ స్రవంతిజయవర్ధన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గిరిజన జాతులు అన్నిటిని సంఘటితం చేసి వారిలో చైతన్యం తీసుకొని వచ్చి వారి హక్కుల కోసం పోరాడిన మహనీయులు రాఘవయ్య అని కొనియాడారు. గిరిజనులను మైదాన ప్రాంతాల వారి దోపిడీ నుంచి రక్షించడానికి కృషి చేయడం, క్రిమినల్ ట్రైబ్స్ చట్టం 1952లో రద్దు చేసేంత వరకు అలుపెరగని పోరాటం చేసినటువంటి మహనీయులు వెన్నెలకంటి రాఘవయ్య. వారి ఆలోచనలు, ఆశయాలు స్ఫూర్తి గా ముందుకు సాగుతామని తెలియజేశారు. వెన్నెలకంటి రాఘవయ్య జయంతి సందర్భంగా గిరిజన యువతని ప్రోత్సహిస్తు వారిలో పోటీతత్వాన్ని, క్రీడలపట్ల అవగాహన కల్పించాలి అనే ఉద్దేశంతో గిరిపుత్ర ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీ 20 క్రికెట్ పోటీల పోస్టర్ ని మేయర్ స్రవంతిజయవర్ధన్ ఆవిష్కరించారు. ఈ అవకాశాన్ని గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలని మేయర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర రాష్ట్ర ఆదిమజాతి సేవక్ సంఘ ట్రస్ట్ బోర్డు నిర్వాహకులు శేషయ్య, సెక్రటరీ భాను, మేనేజింగ్ ట్రస్టీ పొట్లూరి లక్ష్మిప్రసాద్, చేవూరి శ్రీనివాసులు, పొట్లూరి ప్రభాకర్, కత్తి శ్రేష్ఠ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేలు ముగ్గురు ఉన్నా బోరిగాం సమస్య పరిష్కారం కావట్లేదు

**- భైంసా అంబేద్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష**
**- బీఆర్ఎస్ నాయకుల సంఘీభావం**



**నిర్మల్, జూన్ 4 (జనస్వరం) :** జిల్లా ముధోల్ మండలం బోరిగాం గ్రామంలో బుద్ధ విగ్రహ పునఃప్రతిష్టపై కొనసాగుతున్న వివాదం నేపథ్యంలో, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం భైంసా అంబేద్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష పదవ రోజుకు చేరుకుంది. ఈ దీక్ష బుద్ధ అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతుంది. ఈ సందర్భంగా ముధోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సభ్యులు విలాస్ గాదేవార్ నాయకత్వంలో బీఆర్ఎస్ కార్యకర్తలు దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా విలాస్ గాదేవార్ మాట్లాడుతూ, "బోరిగాం సమస్యను ఒక గంటలో పరిష్కరించగలిగే సామర్థ్యం ఉన్నా, రాజకీయ నాయకులు పెద్దగా మాట్లాడుతూనే తప్ప సమస్య పరిష్కారానికి ముందుకు రావడం లేదు" అని విమర్శించారు. "ఈ ప్రభుత్వానికి మాతో సంబంధం లేదని చెప్పండి. ప్రజల చేతులు పట్టుకొని అయినా బీఆర్ఎస్ పార్టీగా సమస్య పరిష్కరిస్తాం" అని స్పష్టం చేశారు. గ్రామంలో ఇద్దరు వర్గాలు ఉన్నా, వీడీసీ సమక్షంలో మాట్లాడుకుని న్యాయం చేసుకోవాలని సూచించారు. "మాజీ ఎమ్మెల్యేలు ముగ్గురు ఉన్నా ప్రజల సమస్య పరిష్కారం కాలేదంటే ఇది ప్రజాస్వామ్య పరాభవం" అని వ్యాఖ్యానించారు. పదిరోజులుగా కొనసాగుతున్న నిరాహార దీక్షపై జిల్లా కలెక్టర్ స్పందించకపోవడం బాధాకరమని నిరసనకారులు పేర్కొన్నారు. "బుద్ధుడు అన్ని మతాలకు చెందినవాడు. అందరూ గౌరవించాలి" అని వారు హితవు పలికారు. "గ్రామంలో 26 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నా, అధికారుల తీరు పట్ల నిరాశ వ్యక్తమవుతోంది. ప్రజలు ఓట్లు వేసి అధికారానికి తీసుకొచ్చిన నాయకులే ఇంత అణచివేతకు పాల్పడటం బాధాకరం" అని మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో బుద్ధ ఆలయానికి 76 గుంటల స్థలం కేటాయించారన్న విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటి ప్రభుత్వంలో ముధోల్ నియోజకవర్గ అభివృద్ధి పూర్తిగా గల్లంతైందని, మిగిలిన పాలన రెండేళ్లే ఉన్నా కూడా అది కొనసాగుతుందో లేదో తెలియని పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీఆర్ఎస్ యువ నాయకుడు దాగ్దే కపిల్, మైనార్టీ నాయకులు అబ్దుల్ హసేన్ రసూల్, రావుల పోశెట్టి, అంబేద్కర్ సంఘం సభ్యులు, భారతీయ బౌద్ధ మహాసభ కార్యకర్తలు, బుద్ధ అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీకి ప్రజా తీర్పు జీర్ణించలేక 'వెన్నుపోటు దినోత్సవం' పేరుతో నాటకం

**- కోవూరు జనసేన కార్యాలయంలో మీడియా సమావేశంలో చప్పిడి శ్రీనివాసులు రెడ్డి వ్యాఖ్యలు**



**కోవూరు, జూన్ 4 (జనస్వరం) :** గతంలో రాష్ట్రాన్ని అరాచక పాలనతో దిక్కుతోచని దశకు నెట్టిన వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తుది శాసనం చెప్పిన చారిత్రక రోజుగా జూన్ 4వ తేదీ గుర్తుంచుకోవాలంటూ నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ చప్పిడి శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నుంచి విముక్తి లభించిన రోజుని "సుపరిపాలన ప్రారంభమైన రోజు"గా కీర్తించాల్సిన స్థితిలో, వైసీపీ మాత్రం ప్రజల తీర్పును జీర్ణించుకోలేక 'వెన్నుపోటు దినోత్సవం' అంటూ నాటకాలు ఆడుతోందని విమర్శించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ప్రజల ఆశయాలకు తగ్గట్టు రాజ్యాంగబద్ధమైన, అభివృద్ధి పరమైన పాలన అందించేందుకు పని చేస్తోందన్నారు. గత ప్రభుత్వ అవినీతి, అక్రమాలు, నియంతృత్వ పాలనతో విసిగిపోయిన ప్రజలు 'స్వర్ణాంధ్రప్రదేశ్' కావాలని తీర్పు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వృద్ధులు, వికలాంగులు, పరిపూర్ణంగా మంచానికే పరిమితమైన వారికి పింఛన్లు భారీగా పెంచింది. వృద్ధులకు రూ.4,000, వికలాంగులకు రూ.6,000, పూర్తిగా సహాయానిర్భరమైన వారికి రూ.15,000 చొప్పున నెల నెలా పింఛన్లు అందిస్తున్నామన్నారు. ఇది కదా అభివృద్ధి, సంక్షేమ పాలన అంటే అని వైసీపీకి ప్రశ్న వేశారు. రాష్ట్రంలో ఇసుక మాఫియాకు చరమగీతం పాడమని, ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరేలా వ్యవస్థను తీర్చిదిద్దామని చెప్పారు. అలాగే రేషన్ సరుకులను 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఎప్పుడైనా తీసుకునే పాత పద్ధతిని తిరిగి ప్రవేశపెట్టడం ద్వారా ప్రజలకు సరళత కల్పించామని వివరించారు. కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అవినీతి రహిత, వివాద రహిత పాలనతో అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా మార్చాలన్నదే తమ పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. "మీకు అభివృద్ధి కనిపించకపోతే మేమేమి చేయగలం? ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించడంలో వైసీపీ విఫలమవుతోంది" అని చప్పిడి శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు ఇంతా మల్లారెడ్డి, జనసేన ఐటి కోఆర్డినేటర్ నక్క శివకృష్ణ, మండల అధ్యక్షులు అల్తాఫ్, జిల్లా సంయుక్త కార్యదర్శి మన్నేపల్లి పవన్ కుమార్, సోలం బాబు, మాధవ్, పెద్ది సాయి తన్మయి, బీజేపీ నాయకులు పోలిశెట్టి సుబ్బారావు, బాబి, దిలీప్, ఇతర కూటమి నేతలు పాల్గొన్నారు.

## కూటమి పాలనలో ఆంధ్రప్రదేశ్ కు మహర్ధశ

**- చిట్వేలి మండలం జనసేన నాయకులు మాదాసు నరసింహ**



**చిట్వేలి, జూన్ 4, (జనస్వరం) :** బుధవారం చిట్వేలి మండల కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో విజయోత్సవాలు ఘనంగా నిర్వహించబడినాయి. కార్యకర్తలు భారీ క్రాకర్లు పేల్చి, భారీ కేక్ కట్ చేస్తూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జనసేన నేత మాదాసు నరసింహ మాట్లాడుతూ, "విధ్వంసం నుంచి వికాసం దిశగా, నేరాంధ్రప్రదేశ్ నుంచి స్వర్ణాంధ్ర ప్రదేశ్ వైపు కూటమి పాలన నడుస్తోంది. ప్రజల నమ్మకాన్ని అనుక్షణం నిలబెట్టుకుంటున్న కూటమి నేతలు, జగన్ మోహన్ రెడ్డి సైకో పాలనకు ప్రజలు ఘోరంగా వ్యతిరేకత వ్యక్తం చేశారు. నేటి రోజును 'వెన్నుపోటు దినం'గా కాకుండా 'విమోచన దినం'గా భావించాలి. వైసీపీ నేతలు తమ ఐదేళ్ల పాలనలో చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. ప్రజలు ఇప్పటికే వారి మూర్ఖత్వాన్ని తిరస్కరించారు," అన్నారు. అలాగే, కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని వరుసగా నెరవేర్చుతూ, పారదర్శకత, జవాబుదారీతనం, బాధ్యతాయుతమైన పాలనతో ప్రజలకు సుపరిపాలన అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోదీ, చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లకు ప్రజల నుంచి అపారమైన ఆశీస్సులు లభిస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పురం గోపాల్, తుపాకుల పెంచలయ్య, షేక్ రియాజ్, కంచర్ల సుధీర్ రెడ్డి, పగడాల శివ, మద్దూరి మన్మధ, కొనిశెట్టి చక్రి, పెద్దం గారి జయ సాయి, మాదాసు శివ, ఆనందల తేజ రాయల్, దాది చంద్ర, మోడం చిరంజీవి, దండు దినేష్, మహంకాళి నాగేంద్ర, సువారపు హరి ప్రసాద్, ఆనందల సాయి, దండు రమేష్, మాదినేని రాజా, పవన్ రాజు, తుపాకుల రవి, నరకట్ల పెంచలయ్య, రామయ్య, చుక్కా ప్రసాద్, నాయిని బాలు, వెంకటాద్రి, గంధం వెంకటేష్, మహేష్, విష్ణు, సుదర్శన్, రమణయ్య, దండు చరణ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

## సుపరిపాలన మొదలై ఏడాది - పీడ విరగడై నేటికీ ఏడాది

**ఉరవకొండ, జూన్ 4, (జనస్వరం) :** కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ఉరవకొండ నియోజకవర్గంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా కేక్ కట్ చేసి, బాణసంచా కాల్చి, సంబరాలు నిర్వహించారు. "సుపరిపాలన మొదలై ఏడాది – పీడ విరగడై నేటికీ ఏడాది" అనే ప్రత్యేక పోస్టర్లను ఆవిష్కరించి ప్రజల్లో చైతన్యం కలిగించే ప్రయత్నం చేశారు. ఈ ఏడాది సందర్భంగా ప్రజా తీర్పుకు, ప్రజా చైతన్యానికి, ప్రజాస్వామ్య పరిరక్షణకు, NDA కూటమి చారిత్రక విజయానికి, జనసేన పార్టీ 100% స్ట్రైక్ రేట్ విజయానికి గుర్తుగా జరుపుకున్నారు. జనసేన పార్టీ ఇన్‌చార్జ్ గౌతమ్ కుమార్ మాట్లాడుతూ గత సంవత్సరం ఇదే రోజు భారతదేశ రాజకీయ చరిత్రలో నిలిచిపోయే రోజు అని తెలిపారు. ఐదేళ్ల అరాచక పాలనను ప్రజలు ఓటుతో తరిమికొట్టి, ప్రజాస్వామ్య పరిరక్షణకు నాంది పలికిన ప్రత్యేకమైన రోజు అని వివరించారు. దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ దృఢమైన నాయకత్వం, నాలుగున్నర దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం, మరియు వ్యవస్థలో మార్పు తేవాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్న జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విజ్ఞత, అలాగే ఉరవకొండ నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకున్న ఆర్థిక




మంత్రి పయ్యావుల కేశవ్ నేతృత్వానికి ప్రజలు అండగా నిలిచి చారిత్రాత్మక విజయాన్ని సాధించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గౌతమ్ కుమార్‌తో పాటు, ఉరవకొండ మండల కన్వీనర్ చంద్రశేఖర్, వజ్రకరూరు మండల కన్వీనర్ కేశవ్, కూడేరు మండల కన్వీనర్ నాగేష్, దేవేంద్ర, రమేష్, మణికుమార్, వంశీ, అనిల్, భోగేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## గుంతకల్‌లో ఘనంగా సుపరిపాలన ప్రారంభం — ఏడాది ఉత్సవం

**గుంతకల్, జూన్ 4, (జనస్వరం) :** పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆవరణలో "సుపరిపాలన మొదలై ఏడాది" ఉత్సవాన్ని సంక్రాంతి పండుగను తలపించేలా ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలో ప్రజా పాలనను స్థాపించి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా జనసేన అధినేత మరియు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు ఈ వేడుకలు జరిగాయి. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త వాసగిరి మణికంఠ ఆధ్వర్యంలో భారీగా మహిళలతో ముగ్గుల పోటీలు నిర్వహించగా, బీజేపీ, తెలుగుదేశం, జనసేన కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వాసగిరి మణికంఠ మాట్లాడుతూ, గతంలో వైసీపీ పాలన ప్రజలను అణచివేసిందని, దాన్ని ఎదిరించి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి ప్రజలు భారీ మద్దతు తెలిపారన్నారు. ప్రస్తుతం నరేంద్ర మోడీ, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, గుంతకల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ నాయకత్వంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇవ్వడంతో పాటు 40 మందికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బండారు ఆనంద్, ఈ బండి శేఖర్, పత్తి హిమబిందు, హరిహర నాథ్, సింగంశెట్టి విశ్వనాథ్, శ్రీదేవి, గుర్రం సూర్యనారాయణ, మహేష్, మస్తానప్ప, అంజి, హనుమంతు, ఫజల్, మహమ్మద్ ఖాజా, కనకవిటి మోహన్, నందీశ్వర్, చిప్పగిరి ప్రతాప్, ఆనంద్ రెడ్డి, అశోక్, పవర్ శేఖర్, సుంకర కృష్ణ, పాండు కుమార్, ఆటో రామకృష్ణ, గాజుల రాఘవేంద్ర, కథల వీధి అంజి, సుంకర నాగరాజు, పూల ఎర్రి స్వామి, దాదు, ఆటో భాష, నాగేంద్ర, అమర్, హరీష్, గిరిధర్ వంటి పలువురు నేతలు పాల్గొన్నారు.



## సుపరిపాలన మొదలై ఏడాది - పీడ విరగడై నేటికీ ఏడాది

**రాప్తాడు, జూన్ 4, (జనస్వరం) :** కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా రాప్తాడు నియోజకవర్గంలో కురుగుంట గ్రామంలో ఘనంగా కేక్ కట్ చేసి, బాణసంచా కాల్చి, సంబరాలు నిర్వహించారు. "సుపరిపాలన మొదలై ఏడాది – పీడ విరగడై నేటికీ ఏడాది" అనే ప్రత్యేక పోస్టర్లను ఆవిష్కరించి ప్రజల్లో చైతన్యం కలిగించే ప్రయత్నం చేశారు. ఈ ఏడాది సందర్భంగా ప్రజా తీర్పుకు, ప్రజా చైతన్యానికి, ప్రజాస్వామ్య పరిరక్షణకు, NDA కూటమి చారిత్రక విజయానికి, జనసేన పార్టీ 100% స్ట్రైక్ రేట్ విజయానికి గుర్తుగా జరుపుకున్నారు. జనసేన పార్టీ ఇన్‌చార్జ్ సాకే పవన్ కుమార్ మాట్లాడుతూ గత సంవత్సరం ఇదే రోజు భారతదేశ రాజకీయ చరిత్రలో నిలిచిపోయే రోజు అని తెలిపారు. ఐదేళ్ల అరాచక పాలనను ప్రజలు ఓటుతో తరిమికొట్టి, ప్రజాస్వామ్య పరిరక్షణకు నాంది పలికిన ప్రత్యేకమైన రోజు అని వివరించారు. సాకే పవన్ కుమార్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ముగ్గుల పోటీలు పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

